ఆంధ్రజ్యోతి


****

ANDHRAJYOTHY

నల్లగొండ

5

శుక్రవారం 20 జూన్ 2025



చికెన్ ధరలు	
లైవ్	115
డ్రెస్	170
స్కిన్‌లెస్	190
గుడ్డు డజన్	70
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	36.5
కనిష్ఠం	23.0

సందర్శనీయ స్థలాల

చార్జీల పెంపు

- ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రదేశాలకు వచ్చే సందర్శకులకు ఎఫెక్ట్
- అమలులోకి వచ్చిన పెంపు

6



తుర్కపల్లి మండలం వాసాలమర్రిలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు

అన్ని హామీలు నెరవేరుస్తాం

- ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు
- రాష్ట్రంలో ఇప్పటికే 2లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన ప్రతీ మాటను, చేసిన ప్రతీ వాగ్దానాన్ని కొంత ఆలస్యమైనా అమలు చేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో, సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని విభలాపురంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో మంత్రి మాట్లాడారు.

7

● ఆంధ్రజ్యోతి, తుర్కపల్లి, మోతె



సూర్యాపేట జిల్లా మోతె మండలం విభలాపురంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు చీర సారె అందజేస్తున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

ఇక ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్

- రిజిస్టర్‌తో పని ఉండదు
- జడ్పీ, మండల పరిషత్‌లో నూతన అటెండెన్స్ విధానం
- రోజుకు రెండుసార్లు హాజరు తప్పని సరి
- పారదర్శక సేవలందించేందుకు నిర్ణయం



రాష్ట్రంలో పారదర్శక పాలన అందించేందుకు ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంటోంది. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా అడుగులు వేస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటోంది. అందుకు ముఖకవళిక (ఫేస్ రికగ్నేషన్) హాజరు విధానాన్ని అమలుచేయనుంది.

● ఆంధ్రజ్యోతి, యాదాద్రి

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులకు విన్నవించేందుకు ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు వస్తుంటారు. అయితే అధికారులు అందుబాటులో లేకపోవడంతో వారు తీవ్ర నిరాశతో వెనుదిరుగుతుంటారు. కార్యాలయాలకు ప్రజలు వచ్చిన రోజు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండకపోవడం, అధికారులు కార్యాలయాల్లో ఉన్న రోజుల్లో ప్రజలకు ఏదో ఒక కారణంతో కార్యాలయానికి రాకపోవడం వంటివి జరుగుతున్నాయి. దీంతో సమస్యలు దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోవడంలేదు. ఈ నేపథ్యంలో ప్రజాపాలనలో ప్రజలకు అధికారులు జవాబుదారీగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మండల పరిషత్, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టింది. ఎంపీపీ, జడ్పీ కార్యాలయాల్లోని అధికారులు సమయపాలన పాటించేలా చూసేందుకు నిర్ణయించింది. అందులో భాగంగా ఇక నుంచి అధికారులు, సిబ్బంది ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ (ముఖకవళిక ఆధారిత హాజరు) ప్రవేశపెట్టనుంది. తొలుత రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో వీటిని ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకుంది. వీటి ఏర్పాటుతో విధులకు ఎగనామం పెట్టే ఉద్యోగులకు ఇకపై కష్టతరం కానుంది. అధికారులు, సిబ్బంది డుమ్మాలు కొట్టే అవకాశం లేకుండా చెక్ పడనుంది. ఉమ్మడి జిల్లాలోని యాదాద్రిభువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని మండలాల వారీగా అధికారులు, సిబ్బంది వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తున్నారు.

● రోజుకు రెండుసార్లు హాజరు


ఉమ్మడి జిల్లాలోని జిల్లాపరిషత్, మండలపరిషత్ కార్యాలయాల్లోని సిబ్బంది రోజులో రెండుసార్లు ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ తప్పనిసరిగా ఇవ్వాలి. ప్రతీ జిల్లా పరిషత్‌లో అధికారులు సిబ్బందితో కలిసి 10 నుంచి 15మంది వరకు ఉన్నారు. మండలపరిషత్‌ల్లో 10మందికి పైగానే అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త విధానం ప్రకారం ప్రతీ ఒక్కరు మిగతా 6వ పేజీలో...

● ఉమ్మడి జిల్లాలో త్వరలో..

ఉమ్మడి జిల్లాలో మూడు జిల్లా పరిషత్ కార్యాలయాలు ఉండగా, యాదాద్రి జిల్లాలో 17 మండల పరిషత్‌లు, నల్లగొండ జిల్లాలో 34, సూర్యాపేట జిల్లాలో 23 మండల పరిషత్‌లు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీవోలు, ఇతర అధికారులు, సిబ్బందికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం నివేదించింది. త్వరలోనే ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ అమలులోకి రానుంది. దీనికి సంబంధించిన యంత్రాలను ప్రభుత్వం మండల, జిల్లాపరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేయనుంది. క్షేత్రస్థాయిలో పర్యటించే అధికారుల హాజరుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

సర్టిఫికెట్లు బకాయిలు చెల్లిస్తేనే..

- తెగేసి చెబుతున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు
- ఇంటర్ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయని ప్రభుత్వం
- అయోమయంలో విద్యార్థులు



భువనగిరి టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల విడుదలలో ప్రభుత్వం చేస్తున్న జాప్యం కారణంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బకాయిలు రాకపోవడంతో ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని ప్రైవేట్ యాజమాన్యాలు తెగేసి చెబుతుండటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం విడుదల చేసే ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు తమకు చెల్లిస్తే సరిపోతుందని, ప్రైవేట్ ఇంటర్ కళాశాల యాజమాన్యాలు ఇంటర్ మొదటి సంవత్సరంలో విద్యార్థులను చేర్చుకున్నాయి. కానీ, మూడేళ్లుగా ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోతుండటంతో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణులై కళాశాలలను వీడుతున్న విద్యార్థులకు ఫీజు మొత్తం చెల్లిస్తేనే మెమో, టీసీ తదితర సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యాలు స్పష్టం చేస్తుండటంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వం ఆలస్యంగా నిధులు విడుదల చేసినా, విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లోనే జమవుతాయని, ప్రస్తుతం ఫీజు చెల్లిస్తేనే ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యాలు తెగేసి చెబుతున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ కళాశాలలతో వాగ్వాదానికి దిగుతున్నారు. ఇదే తరహా పరిస్థితి ఉమ్మడి జిల్లాలోని సుమారు అన్ని ప్రైవేట్ కళాశాలల్లో నెలకొంది. ద్వితీయ సంవత్సరంలో 26,040 మందికి 18,699 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో మిగతా 6వ పేజీలో...



కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

వైద్యులు అందుబాటులో ఉండాలి

దామరచర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్, రికార్డులను, ఔషధాల నిల్వలను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. సమయానుకూలంగా వైద్యులు, సిబ్బంది విధులకు హాజరు కావాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా వైద్యం కోసం వచ్చిన రోగులను వెంటనే ఆసుపత్రిలో చేర్చుకొని వైద్యం అందించాలన్నారు. కేసులు సీరియస్‌గా ఉన్నప్పుడు మాత్రమే నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి లేదా ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడ కేంద్రంలోని పిల్లలను పరిశీలించారు. నిర్మాణంలోని టాయ్‌లెట్స్ పనులను తనిఖీచేశారు. ఆక్టివిటి రూమ్‌లో నూతన సాంకేతికతను ఉపయోగించి విద్యార్థులకు కృత్యాధార పద్ధతిలో బోధించడం జరుగుతుందని, అలాగే ఫిజియోథెరపీ ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. అంతకుముందు కేజీబీవీని తనిఖీ చేసి విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. కేజీబీవీ పరిసరాలు, టాయ్‌లెట్స్ అన్నింటిని తిరిగి పరిశీలించారు. ఆమె వెంట సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్, మండల ప్రత్యేకాధికారి పత్యానాయక్, డీఈవో భిక్షపతి, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

ప్రత్యేక పిల్లలను భవితలో చేర్పించాలి

మిర్యాలగూడ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలందరినీ నమోదు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటుచేసిన భవిత కేంద్రాన్ని సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్‌తో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలకు కృత్యాధార పద్ధతుల్లో విద్యను అందించడం జరుగుతుందన్నారు. అంతేకాక వారి మానసికపరమైన లోపాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు తదుపరి విడతలో విద్యాశాఖ ద్వారా పెన్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని ఆమె తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలో భవిత కేంద్రాన్ని అందంగా తీర్చిదిద్దడంపై సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌ను, విద్యాశాఖ అధికారులను ఆమె అభినందించారు. ఆమె వెంట డీఈవో భిక్షపతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలువురు పోలీస్ అధికారుల బదిలీ

6

అక్రమంగా నల్లమట్టి రవాణా?

రైతుభరోసా దరఖాస్తుకు నేడే ఆఖరు

- కొత్త పట్టాదారుల నుంచి అర్జీల స్వీకరణ
- నేటి రాత్రికి సైట్ నిలిపివేత, ఆ తరువాత దరఖాస్తుల ఆన్‌లైన్



నల్లగొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవడానికి శుక్రవారం సాయంత్రంతో గడువు ముగుస్తోంది. రైతుభరోసా ప్రారంభం నుంచి జూన్ 5 వరకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 20 సాయంత్రంతో అరీజల స్వీకరణకు సమయం ముగుస్తున్నందున ఎవరైనా మిగిలిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. జిల్లాలో మొత్తం 9,500మందికి కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు వచ్చాయి. వీరందరి నుంచి అర్జీలను స్వీకరిస్తున్నారు. శుక్రవారం రాత్రి 8గంటలకు ఈ దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి సైట్ నిలిపివేస్తారు. ఈ నేపథ్యంలో సంబంధిత రైతులు రైతుభరోసా కోసం శుక్ర వారం సాయంత్రం 5గంటల లోగా దరఖాస్తులు చేసుకోవడానికి మండల వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది. కొత్తగా పట్టాదారు పుస్తకాలు పొందిన రైతులందరికీ ప్రస్తుతం రైతుభరోసా అందుతున్న రైతులకు వారికి కూడా జమ చేయనున్నారు. 20వ తేదీన రాత్రికి దరఖాస్తులు ఆన్‌లైన్ పూర్తయిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొత్త పట్టాదారు పుస్తకాలు పొందిన రైతులకు సంబంధించి రైతుభరోసాను ట్రెజరీకి జమ చేస్తారు. ఈ నెల 16వ తేదీ నుంచి రైతుభరోసా ప్రారంభమైన విషయం తెలిసిందే. మరో ఐదు రోజుల పాటు రైతుభరోసాను జమచేస్తారు.ప్రభుత్వం చెప్పిన విధంగా తొమ్మిది రోజుల్లో ప్రతీ అర్హుడైన రైతుకూ అందించడం కోసం కార్యాచరణ రూపొందించారు.

ఇప్పటికే రూ.516కోట్లు జమ

జిల్లా వ్యాప్తంగా గురువారం నాటికి రైతుభరోసా పథకం కింద 4.75 లక్షల మంది రైతుల ఖాతాలలో రూ.516కోట్లను జమచేశారు. రైతుభరోసా కింద రాష్ట్రంలోనే జిల్లాకు అత్యధికంగా నిధులు సమకూరాయి. జిల్లాలో మొత్తం 5,65,803మంది రైతులకు రూ. 738,67,60,000 నిధులు వచ్చాయి. రైతుభరోసా కింద రైతుల బ్యాంకుల ఖాతాల్లో జమైనందున ఆ నిధులను రైతులు ఎరువులకు, వ్యవసాయ పనిముట్లకు, వ్యవసాయ పనులకు వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. వ్యవసాయ విస్తరణ అధికారులు రైతుభరోసా కోసం కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతుల నుంచి దరఖాస్తులు ఇప్పటికే తీసుకుంటున్నారు. వచ్చిన దరఖాస్తులన్నింటికీ శుక్రవారం రాత్రి 8 గంటల లోపు ఆన్‌లైన్ డేటాను పూర్తి చేస్తారు.

జిల్లాకు అత్యధికంగా రైతుభరోసా



రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాకు రైతుభరోసా పథకం కింద నిధులు వచ్చాయి. మొత్తం 5,65,803మంది రైతులకు రూ.738కోట్ల67లక్షల60వేలను విడుదల చేశారు. ఇప్పటివరకు 4.75లక్షల మంది రైతుల ఖాతాలో రూ.516కోట్ల వరకు జమయ్యాయి. కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు శుక్రవారంలోగా రైతుభరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలి. శుక్రవారం రాత్రి వరకు అవకాశం ఉంది. రైతుభరోసా డబ్బులు సాగు అవసరాలకు రైతులు ఉపయోగించడంతో పాటు వ్యవసాయ పనులకు వినియోగించి సద్వినియోగం చేసుకోవాలి.

ఇలా త్రిపాఠి, కలెక్టర్

మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసాను ప్రతి రైతుకూ అందిస్తున్న నేపథ్యంలో వ్యవసాయ సీజన్‌కు ముందే ఎంతగానో ఉపయోగపడుతుందని రైతుల పేర్కొంటున్నారు.

ఫాంపాండ్‌ను పరిశీలించిన కేంద్ర జల సంఘం అధికారి

నార్కట్‌పల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా నార్కట్‌పల్లి మండలంలోని ఏపీలింగోటంలో కొనసాగుతున్న ఫాంపాండ్ పనులను కేంద్ర జల సంఘం అధికారి ఆనంద్‌బాబు గురువారం పరిశీలించారు. ఫారంపాండ్ యొక్క వర్క్ ఐడీ ఎన్ని పనిదినాలు ఇప్పటివరకు పూర్తయిన పనిదినాలు తదితర వివరాల నమోదును పరిశీలించి పనులు జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో, ఎంపీడీవో కత్తురోజు ఉమేశ్‌చారి, ఈసీ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి సైదిరెడ్డి, టీఏ, ఎఫ్ఏలు ఉన్నారు.



ఏపీలింగోటంలో ఫాంపాండ్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

నల్లగొండ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : బెస్ట్ అవైలబుల్ స్కీమ్ పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల జిల్లా కార్యదర్శులు ఖమ్మంపాటి శంకర్, మల్లం మల్లేష్ డిమాండ్ చేశారు. కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, టీజీఎస్ సంఘాల ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఏవో మోతీలాల్‌కు వినతిప్రతం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలో సోషల్‌వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా 19,000 దళిత విద్యార్థులు, 6,000 గిరిజన విద్యార్థులు కలిపి మొత్తం 25 వేల మంది చదువుతున్నారని తెలిపారు. ప్రతి ఏటా ఫీజులు చెల్లించకపోవడంతో రూ.154 కోట్లకు బకాయి పెరిగిందన్నారు. దీంతో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద చదువుకుంటున్న విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని, బిల్లులు రాకపోవడంతో యాజమాన్యాలు ఈ స్కీంపై విద్యార్థులను చేర్చుకునేందుకు ఆసక్తి చూపించడంలేదన్నారు. ప్రభుత్వం వెంటనే బిల్లులను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల నరేష్, ఆయా సంఘాల నాయకులు బొల్లు రవీందర్ పాల్గొన్నారు.



ఏవో మోతీలాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న వివిధ సంఘాల నాయకులు

ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోవాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో రమణారెడ్డి

దేవరకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్ పరిధిలోని చెరువులు, కుంటలు ఆక్రమణకు గురికాకుండా తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఆర్డీవో రమణారెడ్డి కోరారు. గురువారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని అన్నిమండలాల తహసీల్దార్లు, నీటిపారుదలశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైనందున చెరువులు, కుంటలు నీటితో నిండి కోతకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ముందస్తుగా చర్యలు చేపట్టాలన్నారు. చెరువులు, కుంటల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు అధికారులు చెరువులు, కుంటలను పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం, పంచాయతీల నిర్వహణను నిత్యం పర్యవేక్షించాలన్నారు.

సందర్శనీయ స్థలాల చార్జీల పెంపు

» ఉమ్మడి జిల్లాలో 4 ప్రదేశాలకు వచ్చే పర్యాటకులకు ఎఫెక్ట్ » రాష్ట్రంలో టాప్ ఐదు ఆదాయపు జాబితాల్లో భువనగిరి ఖిల్లా


భువనగిరి ఖిల్లా

భువనగిరి టౌన్, జూన్ 19 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్ర వారసత్వ శాఖ (పూర్వపు పురావస్తు ప్రదర్శన శాలల శాఖ) ప్రదేశాలు, కట్టడాలు, మ్యూజియం తదితర స్థలాల సందర్శనీయ చార్జీలు పెరిగాయి. పెరిగిన చార్జీలు గురువారం నుంచే అమలులోకి వచ్చాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. పెరిగిన చార్జీలు ఉమ్మడి జిల్లాలోని నాలుగు సందర్శనీయ స్థలాలను సందర్శించే వారిపై ప్రభావం చూపనుంది. అయితే ఉమ్మడి జిల్లాలో రాష్ట్ర వారసత్వ శాఖ పరిధిలో పలు ప్రదేశాలు ఉన్నప్పటికీ కేవలం నాగార్జునసాగర్, పామునగళ్లు, పణిగిరి మ్యూజియం, భువనగిరి ఖిల్లా సందర్శనకు మాత్రమే చార్జీలను వసూ లు చేస్తున్నారు. అయితే వారసత్వ శాఖకు ఆదాయం లభించే సందర్శనీయ స్థలాల టాప్ 5 జాబితాలో భువనగిరి ఖిల్లా ఉండటం విశేషం.

చార్జీల పెరుగుదల ఇలా..

వివరాలు	ప్రస్తుత చార్జీలు	పెరిగిన చార్జీలు
పెద్దలు	రూ.10	రూ.20
పిల్లలు	రూ.5	రూ.10
కెమెరా / మొబైల్	రూ.50	రూ.50
వీడియో కెమెరా	రూ.200	రూ.200
బైక్ పార్కింగ్	రూ.10	రూ.30
ఫోర్ వీలర్	రూ.20	రూ.200
ఎలక్ట్రికల్ / సీఎన్‌జీ	-	రూ.100
ఇతర వాహనాలు	-	రూ.125
బస్సు	రూ.50	రూ.250
సినిమా షూటింగ్, షార్ట్ ఫిలిమ్స్	రూ.20,000	రూ.1,50,000 + జీఎస్టీ
సినిమా షూటింగ్, వెబ్ సిరీస్		రూ.2,75,000 + జీఎస్టీ
8 గంటల తర్వాత	రూ.2,000	రూ.10,000

భువనగిరి ఖిల్లాపై రూ.6 లక్షల ఆదాయం

భువనగిరి ఖిల్లా సందర్శకుల ద్వారా రాష్ట్ర వారసత్వ శాఖకు ఏడాదికి సుమారు రూ.6 లక్షల పైబడి ఆదాయం లభిస్తుండడం విశేషం. అంతేకాక వారసత్వ శాఖకు ఆదాయం లభిస్తున్న మొదటి ఐదు సందర్శన స్థలాల జాబితాలో భువనగిరి ఖిల్లా ఉంది. అయినప్పటికీ మౌలిక వసతులను కల్పించడంలో వారసత్వ శాఖ విఫలమైందని ఆరోపణలు ఉన్నాయి. విదేశీయులతో పాటు పెద్ద సంఖ్యలో పర్యాటకులు ఖిల్లాను సందర్శిస్తున్నప్పటికీ మూత్రశాలల, మరుగుదొడ్ల నిర్వహణ లేకపోవడంతో వాటిని వినియోగించడం మానేశారు. అలాగే తాగునీటి సదుపాయం అసలే లేదు. దీంతో అత్యవసరాల కోసం బస్టాండ్ లేదా ప్రైవేట్ స్థలాలను వినియోగించాల్సిన పరిస్థితి పర్యాటకులది. వాహనాల పార్కింగ్ జోన్ లేకపోవడంతో సందర్శకులు ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలతో పాటు వాటికి భద్రత కరువవుతోంది. పెరిగిన చార్జీలతో ఆదాయం రెట్టింపు కానుంది. అయితే స్వదేశీ దర్శన్ పథకానికి ఎంపికైన భువనగిరి ఖిల్లాపై సుమారు రూ.100 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయితే ఆదాయం ఊహించనంతగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఖిల్లా అభివృద్ధిపనుల్లో భాగంగా మౌలిక వసతుల పనులు కూడా చేపడుతున్నప్పటికీ కనీసం అవి పూర్తయ్యే వరకైనా ప్రస్తుతమున్న మూత్రశాలలు, మరుగుదొడ్లను వినియోగంలోకి తెచ్చేందుకు వారసత్వ శాఖ శ్రద్ధ చూపాలని సందర్శకులు కోరుతున్నారు. ఆదాయం పెంచుకోవడమే కాదు వసతుల కల్పనపై కూడా అధికారులు శ్రద్ధ చూపాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగిపై దాడి ఘటనపై విచారణ

భువనగిరి (కలెక్టరేట్), జూన్ 19 (ఆంధ్ర జ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2న 4వ తరగతి ఉద్యోగిపై మహిళా అధికారి విచక్షణ రహితంగా దాడి చేసిన ఘటనపై విచారణ ప్రారంభమైంది. విచారణ అధికారిగా జడ్పీ సీఈవో శోభారాణిని కలెక్టర్ నియమించడంతో ఏఎస్‌డబ్ల్యూవో తారాబాయి కిందిస్థాయి ఉద్యోగిపై దాడికి గల కారణాలు, సాక్షుల విచారణతో పాటుగా పూర్తి ఆధారాల సేకరణ కొనసాగుతోంది.

రెవెన్యూ ఉద్యోగ సంఘాల ఆగ్రహం

కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఆఫీస్ సబార్డినేట్ క్రిష్ణపై దాడి చేయడం పట్ల రెవెన్యూ ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. చిన్నతరగతి ఉద్యోగి పట్ల రామన్నపేట ఏఎస్‌డబ్ల్యూవో తారాబాయి చెప్పుతో దాడి చేయడాన్ని తీ వ్రంగా ఖండించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ కోసం ప్రత్యేక అధికారిని నియమించారు. ఏఎస్‌డబ్ల్యూ తారాబాయిపై చర్యలు తీసుకోవాలని వివిధ రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు.

కేసు నమోదు

విధుల్లో ఉన్న ఉద్యోగి కాలర్ పట్టుకొని లాక్కెళ్లడం, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో అక్కడ సిబ్బంది అందరూ చూస్తుండగానే తాడుతో చేతులు కట్టేసి చెప్పులతో పలుమార్లు దాడి చేసిందని ఫిర్యాదుపై పోలీసులు క్రైమ్ నంబర్ 235 బై 2025 తో కేసు నమోదు చేశారు. ఏఎస్‌డబ్ల్యూ తారాబాయిపై బీఎన్‌ఎస్ 127 (2), 132, 352, ఆర్‌బై డబూల్యు సెక్షన్ల ప్రకారం కేసు నమోదైంది.



అన్ని ఆధారాలను పరిశీలిస్తున్నాం

కలెక్టరేట్‌లో ఉద్యోగిపై జరిగిన దాడి ఘటనపై అన్ని ఆధారాలను పరిశీలిస్తున్నాం. కాలర్ పట్టుకొని లాక్కెళ్లడం ప్రత్యక్షంగా చూసిన సాక్షులను విచారిస్తున్నాం. ఎస్సీ డెవలప్‌మెంట్ ఆఫీసులో ఉద్యోగిని కొట్టినప్పుడు చూసిన ఉద్యోగులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నాం. సీసీ పుటేజీని పరిశీలించి పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తాం.

- ఎన్. శోభారాణి, జడ్పీ సీఈవో (విచారణ అధికారి)

తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

భువనగిరి టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు తదితరులపై చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్‌నాయకుడు ఎండీ అతహర్ గురువారం భువనగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ జాన్సన్ ఫార్మా కంపెనీ చెక్‌బౌన్స్ కేసును తన వ్యక్తిగత కేసుగా పేర్కొంటూ, చెక్ ఫోర్జరీ చేశానని సోషల్ మీడియాలో తప్పుడు పోస్టింగులు పెడుతూ వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్‌ఐ కుమారస్వామికి ఫిర్యాదు అందజేశారు.

వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు జరిమానా

నిడమనూరు, జూన్ 19 (ఆంధ్ర జ్యోతి): అజాగ్రత్తగా లారీ నడిపి ఓ వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు జరిమానా వి ధిస్తూ నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి స్వప్న తీర్పు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. 2017 జనవరి 14న నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామంలో రాంపిచ్చయ్య రోడ్డు దాటుతుండగా కన్నెకల్ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న ఏపీ22డబ్ల్యూ 7128 లారీ మిర్యాలగూడలోని బంగారిగడ్డకు చెందిన పోరెడ్డి వెంకట్‌రెడ్డి లారీ డ్రైవర్ అతివేగంగా నడుపుతూ పిచ్చయ్యను ఢీకొనడంతో ఆయన తలకు తీవ్రంగా గాయాలై అక్కడికక్కడే మృ తి చెందాడు. మృతుడి వదిన రాంలింగమ్మ నిడమనూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ యాదయ్య నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నిందితుడి నేరం రుజువు కావడంతో రూ. 5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షం లో మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ సాధన వాదనలు వినిపించగా, కోర్టు పీసీ నవీన్ కేసు విచారణకు సహకరించారని లైసన్ ఆఫీసర్ అలీ అహ్మద్ తెలిపారు.

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా..

» చోరీలకు పాల్పడుతున్న దొంగల అరెస్ట్
» రూ.11 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం
» నలుగురు నిందితుల్లో ఇద్దరు మైనర్లు



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

సూర్యాపేటక్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి తాళం వేసిన నివాసాలు, ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడిన నలుగురు వ్యక్తులను సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ.11లక్షల విలువ చేసే వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కొత్తపల్లి నర్సింహ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కూలీ పని చేసే హుజూర్‌నగర్‌కు చెందిన ఇటికాల ఫణిచంద్, కోదాడ పట్టణానికి చెందిన ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే చేకూరి నాగేంద్రబాబు ఇద్దరు మిత్రులు. వీరిద్దరు జల్సాలకు అలవాటు పడ్డారు. జల్సాలకు అవసరమైన సొమ్ము కోసం కొంతకాలంగా చోరీలకు పాల్పడుతున్నారు. అందులో భాగ ంగా వీరిద్దరితో పాటు కోదాడకు చెందిన ఇద్దరు మైనర్లు కలిసి కోదాడ పట్టణంలో కొంత కాలం క్రితం తాళం వేసి ఉన్న నివాసాల్లో చోరీలకు పాల్పడి ఇళ్లలో భద్రపరిచిన వెండి, బంగారు ఆభరణాలు అపహరించారు.

దొరికింది ఇలా..

కోదాడ, మునగాల మండలాల పరిధిలో ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి మెడలో ఉన్న బంగారు ఆభరణాల ను లాక్కెళ్లారు. నిందితులు చైన్‌స్నాచింగ్ పా ల్పడే సమయాల్లో ఖరీదైన బైక్‌ను వాడినట్లు పోలీసులు గుర్తించారు. ఆ దిశగా కేసులు న మోదు చేసిన కోదాడ, మునగాల సీఐలు విచారణ చేపట్టారు. అందులో భాగంగా విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం ఉదయం నిందితుల్లో ఒకరైన ఫణిచంద్ కోదాడలోని మరో నిందితుడు నాగేంద్రబాబు నివాసానికి వెళ్లాడు. ఇప్పటి వరకు చోరీ చేసి భద్రపర్చిన సొమ్మును వాటాలుగా పంచుకుని విక్రయించి డబ్బు తీసుకోవాలని భావించారు. దీంతో పోలీసులు నాగేంద్రబాబు ఇంటిపై దాడి చేసి ఫణిచంద్, నాగేంద్రబాబును అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా కొంతకాలంగా తమతో పాటు మరో ఇద్దరు మైనర్లు కలిసి కోదాడ, మునగాల, నిడమనూరు, వేములపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. మైనర్లను కూడా అదుపులోకి తీసుకుని చోరీలకు పాల్పడిన సుమారు రూ. 11లక్షల విలువ చేసే వెండి, బంగారు ఆభరణాలతో పాటు ఖరీదైన బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఫణిచంద్, నాగేంద్రబాబుతో పాటు మైనర్లను కోర్టుకు రిమాండ్ తరలించగా ఫణిచంద్, నాగేంద్రబాబును జైలుకు, మిగిలిన ఇద్దరు మైనర్లను జువైనల్ హోంకు తరలించనున్నట్లు తెలిపారు. కాగా ఫణిచంద్‌పై గతంలో కోదాడ పట్టణం, హుజూర్‌నగర్, అనంతగిరి, నిడమనూరు, చిలుకూరు, మునగాల, నేలకొండపల్లి, చౌటుప్పల్, వేములపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 17 దొంగతనాల కేసులు నమోదు కావడంతో కేసుల్లో జైలుకు వెళ్లివచ్చి మళ్లీ చోరీలకు పాల్పడి పట్టుబడినట్లు ఎస్పీ తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న పోలీసులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, కోదాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ కె.శివశంకర్, కోదాడ పట్టణ ఎస్‌ఐ సుధీర్‌కుమార్, ఏఎస్‌ఐ హనుమాన్, సిబ్బంది బి. శ్రీనివాస్, కర్ణాకర్, కృష్ణ, ఎల్లారెడ్డి, కొండల్, సతీష్ పాల్గొన్నారు.

అక్రమంగా నల్లమట్టి రవాణా ?


హైదరాబాద్ వైపునకు వెళ్తున్న మట్టి టిప్పర్

చింతపల్లి, జూన్19(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం అర్కపల్లి గ్రామం నుంచి కుల్‌కులపల్లి వయా మాల్ మీదుగా నిత్యం వందల టిప్పులు నల్లమట్టి అక్రమ రవాణా సాగు తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువులో నల్లమట్టి తవ్వకాలకు సంబంధించి కొద్ది ట్రిప్పులకు అనుమతి తీసుకొని ఉదయం, రాత్రి పగలు తేడా లేకుండా మట్టిని అక్రమంగా హైదరాబాద్ వైపునకు తరలిస్తున్నారు. ఇటీవల కుర్మేడ్ గ్రామం నుంచి మాల్‌కు వస్తుండగా గ్రామస్థులు మట్టి టిప్పర్లను అడ్డుకున్నారు. అధికలోడ్‌తో వాహనాలు రాకపోకలు సాగిస్తుండటం వల్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మట్టి టిప్పర్ల పట్టివేత

చౌటుప్పల్‌రూరల్ : యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు నుంచి చౌటుప్పల్‌లోని ఇటుక బట్టీలకు అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు. చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం మీదుగా టిప్పర్లు వెళ్తుండా స్థానికుల ఫిర్యాదు మేరకు టిప్పర్లను పట్టుకుని తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నల్లగొండ జిల్లాలో పోలీస్ అధికారుల బదిలీ

నల్లగొండ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న పలువురు పోలీస్ అధికారులను బదిలీ చేస్తూ ఐజీ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. హాలియా ఎస్‌ఐగా పనిచేస్తున్న సతీష్‌రెడ్డికి సీఐగా పదోన్నతి కల్పిస్తూ అక్కడే పోస్టింగ్ ఇచ్చారు.

అక్కడ పనిచేస్తున్న సీఐ జనార్దన్‌గౌడ్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కాగా తిప్పర్తి ఎస్‌ఐగా పనిచేస్తున్న సాయి ప్రశాంత్‌ను హాలియా ఎస్‌ఐగా, త్రిపురారం ఎస్‌ఐ ప్రసాద్‌ను పెద్దవూరకు, హుజూర్‌నగర్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐ ముత్తయ్యను నాగార్జునసాగర్‌కు, మిర్యాలగూడ షీ టీమ్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐ నరేష్‌ను త్రిపురారం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. కాగా సాగర్ ఎస్‌ఐ సంపత్, పెద్దవూర ఎస్‌ఐ వీరబాబును వీఆర్‌కు అటాచ్ చేశారు.

బకాయిలు చెల్లిస్తేనే..

(5వ పేజీ తరువాయి)

సుమారు 10వేల మందికి పైగా ఉమ్మడి జిల్లాలోని సుమారు 125 ప్రైవేట్ ఇంటర్ కళాశాలల్లో చదువుతున్నారు. వీరిలో మెజార్టీ విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు అర్హులుగా ఉన్నారు.

రూ.40 కోట్ల బకాయిలు

ఉమ్మడి జిల్లాలో సుమారు 125 ఇంటర్ ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. అర్హులైన విద్యార్థులకు ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ. 2 వేలు, ఉపకార వేతనాలుగా రూ.5వేలు మొత్తంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు రూ. 15వేలు ప్రభుత్వం చెల్లిస్తుంది. ఆ రెండు విద్యార్థుల ఖాతాల్లోనే జమవుతాయి. కానీ, బ్యాంక్ పాస్‌పుస్తకాలు మాత్రం యాజమాన్యాల వద్ద ఉంటాయి. ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ జమ అయిన వెంటనే యాజమాన్యాలు పాస్‌పుస్తకాలను ఇస్తారు. విద్యార్థులు బ్యాంకుకు వెళ్లి ఆ మొత్తాన్ని డ్రా చేసి కళాశాలలో పాస్‌పుస్తకాలతో సహా తిరిగి ఇవ్వాలని పరస్పర ఒప్పందంతో అడ్మిషన్లు జరుగుతాయి. అయితే మూడేళ్లుగా ప్రభుత్వం నిధులను మం జూరు చేయకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్ కళాశాలలకు సుమారు రూ.40కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. వీటిలో సగం ప్రథమ, మిగతా సగం ద్వితీయ సంవత్సరం విద్యార్థుల బకాయిలు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఇంకో ఏడాది కళాశాలలోనే ఉంటుండగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కళాశాలలను వీడుతున్నారు. వీరిలో ఫెయిల్ అయిన వారు ఇంటికి, ఇతర పనులకు పరిమితమవుతూ సర్టిఫికెట్లను తీసుకొని పరిస్థితి. కానీ, ఉత్తీర్ణులైన విద్యార్థులు ఉన్నత విద్యలో చేరేందుకు సర్టిఫికెట్లు తప్పనిసరి. దీంతో అనుకున్నట్టుగా ప్రభుత్వం స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయనుందున మొత్తం ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని ప్రైవేట్ యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి.

అయోమయంలో విద్యార్థులు

ఉన్నత విద్యకు వెళ్లే ముందు సర్టిఫికెట్ల రూపంలో ఇంటర్ యాజమాన్యాలు చేస్తున్న తకరారుతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. ఆర్థిక స్తోమత ఉన్న తల్లిదండ్రులు ఫీజు చెల్లిస్తుండగా, మిగతా తల్లిదండ్రులు యా జమాన్యాలను ప్రాధేయపడుతున్నారు. అయినప్పటికీ సర్టిఫికెట్ల జారీలో ఫలితం లభించడం లేదు. పలువురు విద్యార్థులు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న జిరాక్స్ ప్రతితో డిగ్రీ కోర్సుల్లో చేరుతున్నారు. డిగ్రీ ప్రవేశాలకు టీసీ తప్పనిసరి అయినప్పటికీ అడ్మిషన్లలో డిగ్రీ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల మధ్య నెలకొన్న పోటీతత్వంతో టీసీలు ఇవ్వకున్నా ప్రవేశాల తంతును పూర్తిచేస్తున్నారు. డిగ్రీ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ అప్లికేషన్లను కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోనే సరిపెడుతున్నారు. కానీ, సైన్స్ ఆధారిత ఎంసెట్, నీట్ తదితర కోర్సుల్లో చేరేందుకు తప్పనిసరిగా ఒరిజినల్ మెమో, టీసీ, స్టడీ కండక్ట్ సర్టిఫికెట్స్ తప్పనిసరి. దీంతో ఆయా కోర్సుల్లో చేరే విద్యార్థులు తప్పనిసరిగా ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు. కానీ, డిగ్రీ తదితర స్థానిక కోర్సుల్లో చేరే విద్యార్థులు ఆన్‌లైన్ ప్రతులతోనే గట్టెక్కుతున్నట్టు ప్రైవేట్ యాజమాన్యాలు వాపోతున్నాయి. ఈ తరహా పరిస్థితికి ప్రభుత్వ వైఖరే కారణమని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏటా క్రమం తప్పకుండా నిధులను విడుదల చేస్తే విద్యార్థులు గౌరవప్రదంగా కళాశాలలు వీడే పరిస్థితి ఉంటుందని అంటున్నారు. కానీ, నిధుల విడుదలలో ప్రభుత్వం చేస్తున్న జాప్యంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆర్థిక, మానసిక ఇబ్బందులకు గురవుతుండగా, యాజమాన్యాలు ఆర్థిక కుదుపునకు గురవుతున్నారని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధుల విడుదలపై ప్రైవేట్ యాజమాన్యాలకు హామీ ఇచ్చి సర్టిఫికెట్ల జారీని సులభతరం చేయాలని కోరుతున్నారు.



ఆర్థిక ఇబ్బందుల్లో యాజమాన్యాలు

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదలలో ప్రభుత్వం మూడేళ్లుగా చేస్తున్న జాప్యంతో ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్ యాజమాన్యాలకు సుమారు రూ .40కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. విద్యార్థులు ఫీజులు చెల్లించక, ప్రభుత్వం నిధులు కేటాయించక యాజమాన్యాలు అప్పుల పాలయ్యాయి. అలాగే గతంలో ఉత్తీర్ణులైన విద్యార్థులు కూడా సర్టిఫికెట్లను తీసుకొని పరిస్థితి ఉంది. మా ఆర్థిక దుస్థితిని అర్థం చేసుకొని ప్రభుత్వం, తల్లిదండ్రులు సహకరించాలి.

- మల్లేశం, రాష్ట్ర అధికార ప్రతినిధి, ఇంటర్ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్



సర్టిఫికెట్లు ఇవ్వాల్సిందే

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలతో నిమిత్తం లేకుండా ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వాల్సిందే. బకాయిలు కోసం ప్రభుత్వంపై పోరాడాలి గానీ, విద్యార్థులను వేధించవద్దు. నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం. సర్టిఫికెట్లు ఇవ్వని కళాశాలలపై విద్యార్థులు, తల్లిదండ్రులు అధికారులకు ఫిర్యాదు చేయాలి.

-సి.రమణి, ఇంటర్ నోడల్ అధికారి, యాదాద్రి జిల్లా

వేర్వేరు ప్రమాదాల్లో ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరి దుర్మరణం

తిప్పర్తి, జూన్ 19(ఆంధ్రజ్యోతి) :నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో గురువారం ప్రమా దవశాత్తు ట్రాక్టర్ తిరగపడి ఇద్దరు మృతి చెందారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని తిప్పలమ్మగూడెం గ్రామానికి చెందిన దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి(51) తన ట్రాక్టర్‌తో గ్రామశివారులోని తన బురద పొలాన్ని దున్నుదున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ బురదలో దిగబడడంతో ట్రాక్టర్‌ను బయటికి తీసే క్రమంలో ఒక్కసారిగా ట్రాక్టర్‌ను రేస్ చేయడంతో ముందు టైర్లు లేచిన ట్రాక్టర్‌పైకి లేచి నిటారుగా నిలబడింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న వెంకట్‌రెడ్డి ఇంజన్‌కు, ట్రాక్టర్ నాగలికి మధ్యలో ఇరుక్కొని ఛాతికి, కుడికాలుకు ఇతర శరీర భాగాలకు గాయాలయ్యాయి. ఘటన జరిగిన సమయంలో అక్కడే ఉన్న భార్య సరిత స్థానికుల సాయంతో జేసీబీ వాహనంతో ట్రాక్టర్‌ను తీసేటప్పటికే అప్పటికే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రాంమూర్తి తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు సంతానం కలరు.

● నూతనకల్ : సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలోని పెదనెమిల గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందాడు. ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆ గ్రామానికి చెందిన గంగుల వీరస్వామి(42) ఆ గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గ్రామ శివారులో దుక్కి దున్నుతుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో పక్కనే ఉన్న రాయిపై తల తాకడంతో తల పగిలి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. భార్య ఉపేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


వెంకట్‌రెడ్డి , వీరస్వామి (ఫైల్)

ఇక ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్

(5వ పేజీ తరువాయి)

సమయపాలన ప్రకారం ఉదయం 10.30 గంటలకు, సాయంత్రం 5గంటలకు తప్పకుండా హాజరు వేయాలి. కార్యాలయానికి ఆలస్యంగా వచ్చిన పక్షంలో సమయాన్ని బట్టి సెలవుల్లో కోత విధించే అవకాశం ఉంది. ఇప్పటికే నూతన హాజరు విధానానికి సంబంధించి ఉద్యోగుల పూర్తి వివరాలను సేకరించిన ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించింది.

అటెండెన్స్ రిజిస్టర్‌కు చెల్లు

ప్రస్తుతం జిల్లా, మండల పరిషత్ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్నారు. ఈ విధానంతో సిబ్బంది ఒక రోజు కార్యాలయానికి హాజరుకాకున్నా, అధికారి అనుమతితో వచ్చినట్టు సంతకాలు చేయడం, ఆలస్యంగా వచ్చి త్వరగా వెళ్లిపోవడం వంటివి జరుగుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. మారుమూల మండలాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండటంలేదని, సిబ్బంది కూడా సకాలంలో హాజరు కావడంలేదనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రిజిస్టర్‌లో సంతకం చేసే విధానాన్ని పక్కనపెట్టి, పక్కాగా ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ ఉండేలా ప్రభుత్వం చర్య లు చేపట్టింది. ఈ విధానంతో అమలుతో అధికారులు సకాలంలో కార్యాలయాలకు హాజరుకావడంతోపాటు ప్రజలకు అందుబాటులో ఉంటారని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజలకు కూడా వారు సమస్యలను విన్నవించే అవకాశం కల్పించినట్టు అవుతుంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో ఈ హాజరు విధానం త్వరలోనే అమలుకానుంది.

త్వరలోనే నూతన హాజరు విధానం

ఉమ్మడి జిల్లాలోని జిల్లాపరిషత్, మండలపరిషత్ కార్యాలయాల్లోని సిబ్బంది రోజులో రెండు సార్లు ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రతీ జిల్లా పరిషత్‌లో అధికారులు సిబ్బందితో కలిసి 10 నుంచి 15మంది, మండలపరిషత్‌ల్లో 10మందికి పైగానే అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త విధానం ప్రకారం ప్రతి ఒక్కరూ సమయపాలన ప్రకారం ఉదయం 10.30గంటలకు, సాయంత్రం 5గంటలకు తప్పకుండా హాజరు నమోదు చేయాలని కార్యాలయానికి ఆలస్యంగా వచ్చిన పక్షంలో సమయాన్ని బట్టి సెలవుల్లో కోత విధించే అవకాశం ఉంటుంది. ఇప్పటికే నూతన హాజరువిధానానికి సంబంధించిన ఉద్యోగులు పూర్తి వివరాలను సేకరించి, ప్రభుత్వానికి నివేదించాం.

శోభారాణి, జడ్పీ సీఈవో

కోతుల బెడద నివారణకు విశ్రాంత ఉద్యోగుల కృషి

మాడ్గులపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం పోరెడ్డిగూడెం గ్రామంలో కోతుల బెడదను నివారించేందుకు విశ్రాంత ఉద్యోగులు చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు గ్రామస్తులు అన్నారు. గురువారం పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో కోతులు అధికంగా ఉండడంతో పంట పొలాలను నాశనం చేస్తున్నాయని అన్నారు. దీంతో గ్రామంలోని విశ్రాంత ఉద్యోగులు తమ సొంత ఖర్చులతో కోతులను పట్టుకునే వారిని రప్పించి కోతులను పట్టుకొని దూర ప్రాంతాలకు పంపించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, అప్పరెడ్డి, రాంరెడ్డి, వీరారెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

పోలీసులకు అనుమానాస్పద మహిళల అప్పగింత

మోత్కూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామంలో దొంగతనం చేయడానికి రెక్కీ నిర్వహిస్తున్న నలుగురు మహిళలను గ్రామస్తులు పట్టుకుని గురువారం సాయంత్రం పోలీసులకు అప్పగించారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం మధ్యాహ్నం నుంచి నలుగురు మహిళలు గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతుండాన్ని గ్రామస్తులు గ్రహించారు. గ్రామస్తులు మీది ఏ ఊరు ఇక్కడెందుకు ఉన్నారు అని ప్రశ్నించగా వారు సరైనా సమాధానం చెప్పపోగా గ్రామస్తులనే దబాయించారు. దీంతో వారు పిల్లలను ఎత్తుకపోయే వారేమోనన్న అనుమానంతో ప్రజలు వారిని గ్రామపంచాయతీ వద్దకు తీసుకెళ్లి నిలదీశారు. ఆ మహిళలు గ్రామస్తులతో తగాదా పడి, దబాయించి తప్పించుకుని వెళ్లిపోయే ప్రయత్నం చేశారు. ప్రజలు అధికసంఖ్యలో గుమికూడి పోలీసులకు ఫోన్ చేసి పిలిచి వారికి అప్పగించారు. తమ విచారణలో వారు పాత నేరస్తులుగా గుర్తించామని ప్రొహిబి షనరీ ఎస్‌ఐ నోయల్ రాజు తెలిపారు. ఒక్కొక్కరి మీద మూడు, నాలుగు కేసులు ఉన్నాయన్నారు. వారు ముశిపట్లలో దొంగతనం చేయడానికి రెక్కీ నిర్వహించి ఉంటారన్నారు. వరంగల్ జిల్లా వరంగల్ రెడ్డినగర్, హన్మకొండ, ఖాజీపేట, మడికొండకు చెందిన తూర్పతి మైసమ్మ, స్వాతి, శారద, సునీతగా గుర్తించామన్నారు. వారిపై గతంలో కేసులు ఉండటంతో వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి, సీసీఎస్‌కు అప్పగిస్తున్నామని, అక్కడ వారిని విచారిస్తారన్నారు.


పోలీసుల అదుపులో ఉన్న మహిళలు

అన్ని హామీలు నెరవేరుస్తాం

- రాష్ట్రంలో ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు
- రాష్ట్రంలో ఇప్పటికే 2లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

తుర్కపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన ప్రతీ మాటను.. చేసిన ప్రతీ వాగ్దానాన్ని కొంత ఆలస్యమైనా అన్నింటినీ అమలుచేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో గురువారం తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల మంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనీల్‌కుమారెడ్డి, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బండ్రు శోభారాణి, కలెక్టర్ హనుమంతరావుతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైనా పేదలెందరున్నా వారందరికీ ఇదిరమ్మ ఇళ్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మాజీ సీఎం కేసీఆర్ వాసాలమర్రి గ్రామాన్ని దత్తత తీసుకుని ఈ గ్రామాన్ని రోల్ మోడల్‌గా చేస్తానని చెప్పాడే తప్పా గ్రామంలో ఏ ఒక్కరికీ ఇళ్లు కట్టివ్వలేదన్నారు. తన స్వార్థం కోసం వాసాలమర్రిని ధ్వంసం చేసి తన ఫాంహౌస్‌కు నాలుగు లైన్ల రోడ్డు వేసుకున్నాడన్నారు. ఈ నెల 6న తిరుమలాపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన సభలో సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్ వాసాలమర్రి గ్రామాన్ని దత్తత తీసుకుని ఆ గ్రామ సమస్యలను పరిష్కరించలేదని, తమ ప్రభుత్వంలో ఆ గ్రామ సమస్యలను పరిష్కరించాలని చెప్పారని ఆయన సూచనల మేరకే ఈ గ్రామంలో 227 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రతీ ఇంటికి 200 యూనిట్లు ఉచిత కరెంట్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అంతేకాకుండా దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా పేదలకు సన్న బియ్యం పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా పేదవాడికి రూ. 10లక్షల వరకు నాణ్యమైన ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. హాస్టళ్లు, కాలేజీల్లో చదివే పేదవాడి పిల్లలకు 40 శాతం డైట్ చార్జీలు, ఆడపిల్లలకు కాస్మోటిక్ చార్జీలను 200శాతం వరకు పెంచిందన్నారు. పేదోడి సొంతింటి కళను సాకారం చేసేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ.22,500 కోట్లతో 4.5లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. ప్రతి ఇంటికి రూ. 5లక్షల రూపాయలను నాలుగు విడుతల్లో చెల్లిస్తుందన్నారు. అంతే కాకుండా రాబోయే మూడున్నర సంవత్సర కాలంలో మరో 20లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులెదురుకుంటున్న ప్రతి భూ భూ భారతి ద్వార పరిష్కారమవుతుందన్నారు. అంతే కాకుండా సర్వే వ్యవస్థను తెచ్చి రాష్ట్రంలో 6వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించి ప్రతి జిల్లా, మండలంలో వంద మంది సర్వేయర్లు ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఆయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనీల్‌కుమారెడ్డి, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బండ్రు శోభారాణి, కలెక్టర్ హనుమంతరావు ప్రసగించారు. మొదటి సారిగా గ్రామానికి వచ్చిన మంత్రికి గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. మంత్రి కొంత దూరం ఎద్దుల బండిపై ఊరేగింపుగా వచ్చాడు. కార్యక్రమం ప్రారంభించే ముందు జ్యోతి ప్రజ్వళన, రాష్ట్రీయ గీతాన్ని ఆలపించారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టరు భాస్కర్‌రావు, నార్ముల్ మదర్ డెయిరీ ఛైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, ఆలేరు మార్కెట్ ఛైర్మన్ అయినాల చైతన్యమహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అవేస్ చిస్తీ, మాజీ డీసీసీబీ డైరెక్టర్ జనగాం ఉపేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, హౌజింగ్ డీఈ శ్రీరాములు, ఆర్డీవో కృష్ణారెడ్డి, తహసీల్దార్ దేశ్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధానావతు శంకర్‌నాయక్, నాయకులు చాడ భాస్కర్‌రెడ్డి నీలం పద్మ, పలుగుల శ్రీనివాస్, దొమ్మాట బాబు తదితరులు పాల్గొన్నారు.



వాసాలమర్రిలో ఆకుల ఆగవ్వకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రంతో పాటు బీర్ల అయిలయ్య సహకారంతో లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసిన మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

ఆగవ్వకు లక్ష రూపాయల ఆర్థిక సాయం

వాసాలమర్రి గామంలో గురువారం తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల మంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల మొదటి మంజూరు పత్రం ఆకుల ఆగవ్వకే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. కాగా ప్రభుత్వ విప్ బీర్ల ఆయిలయ్య బుధవారం గ్రామంలో పర్యటించిన సందర్భంగా ఆకుల ఆగవ్వతో కాసేపు ముచ్చటించారు. ప్రభుత్వం ఇందిరమ్మ మొదటి ఇళ్లు నీకే ఇస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా ఇంటి నిర్మాణానికి తన వంతు సహాయంగా లక్ష రూపాయలు కూడ ఇస్తానని ఎమ్మెల్యే ఆగవ్వకు హామీ ఇచ్చిన మేరకు సభలో రూ.లక్ష నగదును అందజేశారు.



వాసాలమర్రిలో ఎడ్లబండిపై వస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియ: మంత్రి పొంగులేటి

మోతె, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం విడతల వారీగా చేపడతామని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని విభలాపురం గ్రామాన్ని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని మంత్రి పరిశీలించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం 2నర లక్షల ఇండ్ల నిర్మాణం సగానికి పైగా పూర్తిచేసినట్లు తెలిపారు. 4.50లక్షల మందిని లబ్దిదారులుగా గుర్తించినట్లు తెలిపారు. ఈపథకం విడతల వారీగా నిరంతరం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇళ్లు లేని ప్రతి ఒక్కరూ నిర్మాణం చేపట్టాలన్నారు. మోతె మండలం విభలాపురంలో పైలెట్ ప్రాజెక్టు కింద 146 మంజూరుకాగా 75 ఇళ్లు పూర్తిగా నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతీ పేదవాడికి సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి వర్గం పనిచేస్తుందన్నారు. అనంతరం గ్రామంలో నిర్మాణం చేపడుతున్న ఇళ్లను పరిశీలించారు. నాణ్యమైన ఇసుకను వాడాలన్నారు. ఇండ్లు సగానికి పైబడి పూర్తయిన వారి ఇళ్లకు చేరి వారికి దుస్తులు అందజేశారు. నేరేడువాయిలో నూతనంగా నిర్మాణం చేపట్టిన గ్రామపంచాయతి భవనం, నేరేడువాయి నుంచి దుబ్బతండా వరకు కోటి 70 లక్షల రూపాయలతో నిర్మాణం చేపడుతున్న బీటీరోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గంలో 3500 ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అందులో బాగంగా మోతె మండలం విభలాపురం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించి 150 ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రతీ పేదవాడు ఇంటినిర్మాణం కావాలంటే నేరుగా తన దృష్టికి తేవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పర్యవేక్షణకు వచ్చిన మంత్రి పొంగులేటిని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, సీనియర్ నాయకుడు మైనంపాటి గుర్వారెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఆర్డీవో వేణుమాధవ్, మాజీ ఎమ్మెల్యె వేనేపల్లి చందర్‌రావు, మాజీ ఎంపీపీ ముప్పాని ఆశ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఉమ్మడి జిల్లా డీసీసీ ఛైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, మాజీ జడ్‌పీటీసీలు భాణోత్ మాతృనాయక్, పుల్లారావు, నాయకులు కీసర సంతోష్‌రెడ్డి, సామ వెంకట్‌రెడ్డి గట్టికొప్పుల వీరారెడ్డి, లక్ష్మారెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

టీఎన్‌జీవోస్ సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్



టీఎన్‌జీవో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్

యాదగిరిగుట్ట/ యాదగిరిగుట్ట రూరల్, జూన్ 19, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని టీఎన్‌జీవోల సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మారం జగదీశ్, మోజీబ్, టిజివోల జిల్లా అధ్యక్షుడు మందడి ఉపేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం గుట్టలో టీఎన్‌జీవోల రాష్ట్ర కార్యవర్గ సమావేశం తెలంగాణ రాష్ట్ర ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ గజ్వేల్ రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారు మాట్లాడుతూ గతంలోనే ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అలవెన్స్‌లు మాదిరిగానే దేవాలయాల ఉద్యోగులకు వర్తిస్తాయని 2001 జీవో విడుదలైందని గుర్తుచేశారు. ప్రధాన దేవాలయాల ఉద్యోగులకు హెల్త్ కార్డులు, పీఆర్‌సీ అనుమతిస్తూ రాబోయే జీవోలో ప్రత్యేకంగా నమోదు చేయాలని, జీవో 888ను ఆలయాల్లో ఉన్నపోస్టులకు అనుగుణంగా పూర్తిస్థాయిలో సవరణ చేసి, జీవో 261 సవరణ చేయాలని అన్నారు. ఆలయాలలో పనిభారం తగ్గించేందుకు అవసరం మేరకు క్యాడర్ స్ట్రేను అనుమతిస్తూ ఆయా శాఖల్లో ఖాళీలను రెగ్యులర్ పద్దతిని చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆలయాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత వరకు పరిష్కరించే విధంగా కృషి చేస్తామని ఉద్యోగులకు హామీ ఇచ్చారు. సమావేశంలో వేములవాడ, భద్రాచలం, బాసర, కొండగట్టు, కొమురవల్లి, యాదగిరిగుట్ట ఆలయాల యూనియన్ అధ్యక్షులు కూరగాయాల శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, చందు, మల్లికార్జున్‌శర్మ, దూశెట్టి కృష్ణగౌడ్, దయానంద్ పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేసీ, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్దతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 17,39,491 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలపగా నిత్య కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్‌గా రమణ ఎంపిక



కోదాడ, కోదాడ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన ముత్తవరపు వెంకటరమణ ఫార్మా కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్‌గా ఎంపికైనట్లు రిటైర్డు హెచ్‌ఎం ముత్తవరపు రామారావు తెలిపారు. గురువారం కోదాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెంకటరమణ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌గా, నేషనల్ ఫార్మసీ టీచర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. వెంకట రమణ ఎంపికపై డీసీసీబీ మాజీ ఛైర్మన్ ముత్తవరపు పాండురంగావు, కాపుగల్లు మాజీ సర్పంచ్ సతీష్, నంబూరి సూర్యం, హనుమంతరావు హర్షం వ్యక్తం చేశారు.

క్యాబినెట్‌లో యాదవులు లేకపోవడం శోచనీయం

భానుపురి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ క్యాబినెట్‌లో యాదవులు లేకపోవడం శోచనీయమైని తెలంగాణ రాష్ట్ర బీసీ జనసభ అధ్యక్షుడు డి.రాజారాంయాదవ్ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని యాదవుల జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30న ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్ వద్ద నిర్వహించే యాదవుల ఆత్మగౌరవ ధర్నా పోస్టర్‌ను అవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే యాదవులు లేని క్యాబినెట్ లేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలోనే యాదవులకు మంత్రి పదవి ఇవ్వకుండా యాదవుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారన్నారు. యాదవుల ఆత్మగౌరవాన్ని తెలంగాణ ప్రభుత్వం కాపాడాలని ఈ నెల 30న ఇందిరాపార్కు వద్ద యాదవుల ఆత్మగౌరవ ధర్నాను నిర్వహించి ప్రభుత్వం కన్ను తెరిపిస్తామన్నారు. యాదవుల కార్పొరేషన్ కోసం రూ10 కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో వాటా కేటాయించాలన్నారు. లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వ పతనం యాదవుల నుంచే మొదలవుతుందని అన్నారు. యాదవులు లేని గ్రామం లేదన్నారు.యాదవులకు ఇచ్చిన హామీలను తెలంగాణ ప్రభుత్వం తుంగలో తొక్కుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడంగి గోవర్ధన్‌యాదవ్, యాదవ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల కృష్ణ, మర్యాద సైదులు యాదవ్, తూము వెంకన్నయాదవ్, గొడ్డెటి సైదులుయాదవ్, తగుల్ల జనార్ధన్ యాదవ్, కోడి లింగయ్యయాదవ్, కంచుగట్ల జానయ్యయాదవ్, బడుగుల సైదులుయాదవ్, నాగార్జునయాదవ్, సుంకరబోయిన వెంకన్నయాదవ్, ఉగ్గం నగేష్ యాదవ్, కాసం రాముయాదవ్, తదితరులు ఉన్నారు.



సూర్యాపేటలో పోస్టర్ అవిష్కరిస్తున్న యాదవ సంఘం నాయకులు డి.రాజారాంయాదవ్, గోవర్ధన్‌యాదవ్, మర్యాద సైదులుయాదవ్

హ్యాండ్ బాల్ పోటీలకు ఇరువురి ఎంపిక



శివాని



బన్నీ

నకిరేకల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నల్లగొండబ నకిరేకల్ మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి జూనియర్ విభాగం హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. మంగళపల్లి గ్రామానికి చెందిన కందికంటి శివాని నకిరేకల్‌లోని సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. అలాగే అదే గ్రామానికి చెందిన దోరెపల్లి బన్నీ ఈ ఏడాది పదో తరగతి పూర్తి చేశాడు. వీరిద్దరూ ఈ నెల 4నుంచి 6వరకు మంగళపల్లిలో నిర్వహించిన 47వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో నల్లగొండ జిల్లా తరుపున పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 18నుంచి 23వరకు బీహార్ రాష్ట్రంలోని నవాడలో జరిగే 47వ జాతీయ స్థాయి జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఈ ఇరువురూ పాల్గొననున్నట్లు మంగళపల్లి జడ్పీ పాఠశాల హెచ్‌ఎంక్రవీరారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు చైతన్యకుమార్‌లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన శివాని, బన్నీలను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్థులు అభినందించారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	514.30 అడుగులు
టీఎంసీలు	139.0872
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	450 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	450 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	24.41 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	641.40 అడుగులు
టీఎంసీలు	3.54
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	90.77క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	370.48క్యూసెక్కులు

ఆయిల్‌పామ్ సాగుతో ప్రతి నెలా ఆదాయం



పిన్నాయిపాలెంలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటుతున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగయ్య

సూర్యాపేట రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలం పంట అయినా ఆయిల్ పామ్ తోటలను సాగు చేసి ప్రతి నెలా ఆదాయం పొందాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి తీగల నాగయ్య అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం పిన్నాయిపాలెం గ్రామంలో మాదగొని రమేష్ వ్యవసాయ క్షేత్రంలో నూతనంగా సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ సాగును మొక్కను నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ తోటలను సాగుచేస్తే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని అన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసిన నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమవుతుందన్నారు. ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ప్రభుత్వం బిందు సేద్యం, ఎరువులు, అంతర పంటలకు రాయితీలు ఇస్తుందన్నారు. ఎరువులు, అంతర పంటల యాజమాన్యానికి ఎకరానికి రూ.4200చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాన్నికిన అందజేస్తోందన్నారు. అసక్తి ఉన్న రైతులు ఉద్యానవన శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ తెలంగాణ డివిజనల్ మేనేజర్ యాదగిరి, హరీష్, శశికుమార్, వెంకట్, యానాల సుధాకర్, రైతు కాశయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 16 మంది ఎంపిక

భువనగిరి టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పట్టణ శివారు రాయిగిరిలోని యూనిటీ ఫార్మసీ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 16 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. చివరి సంవత్సరం విద్యార్థులకు ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. రాత, మౌఖిక పరీక్షల ఆధారంగా విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ ఏ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులనుకళాశాల డైరెక్టర్ పి.గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పంపండి శ్రీనివాస్, డాక్టర్ సరిత, ఏవో సునీత, ఫ్యాకల్టీ తదితరులు అభినందించారు.

నిత్యపూజా కైంకర్యాలు

యాదగిరిగుట్ట సమాచారం

ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు
సుప్రభాతసేవ : ఉదయం 3.30-4 గంటల వరకు
ఆరాధన : 4-4.30వరకు, బాలభోగం:4.30-5.15వరకు
నిజాభిషేకం: 5.15-6.15, పుష్పాలంకరణ సేవ: 5.30-6.00
సహస్రనామార్చనలు: 6.15 నుంచి 7 గంటల వరకు
రాజభోగం: 11.45-12.30, మధ్యాహ్నం 3-4 గంటలవరకు ఆలయం మూసివేత
తిరువారాధన:సాయంత్రం 7-7.45, సహస్రనామార్చన:రాత్రి 7.30-8.15
ఆరగింపు: 9-9.45, శయనోత్సవ దర్శనం: 9.30- 9.45ద్వార బంధనం
ఉచిత దర్శనం:ఉదయం 6-7.30, 10-11.45 సాయంత్రం 5-7,రాత్రి 8.15-9
వీఐపీ దర్శనాల వేళలు: ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు

ఆదర్శంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు

తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించిన వైనం

నార్కట్‌పల్లి, పెద్దఅడిశర్లపల్లి జూన్ 19(ఆంధ్రజ్యోతి): తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఆదర్శంగా నిలిచారు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి, పెద్దఅడిశర్లపల్లి మండలాల ప్రభుత్వ ఉపాధ్యాయులు. నార్కట్‌పల్లి మండలంలోని ఏపీ లింగోటం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఆదిమళ్ల మణిరాజు తన కుమారుడు సత్యరాజును తను బోధన చేస్తున్న పాఠశాలలోనే పదో తరగతిలో గురువారం అడ్మిషన్ చేయించాడు. ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు కొత్తగూడెం ప్రాథమిక పాఠశాల, 6,7వ తరగతులను జడ్పీహెచ్ఎస్ బీ.వెల్లెంల, 8వ తరగతి ఆకాశ్ (ప్రైవేటు), 9వ తరగతి ఎస్వీఆర్ (ప్రైవేటు)లో తన కుమారుడిని చదివించి, ఈ పర్యాయం పదో తరగతిలో ఏపీలింగోటం జడ్పీహెచ్ఎస్‌లోనే చేర్పించి పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు మణిరాజు ఆదర్శంగా నిలిచాడు. ఈ సందర్భంగా మణిరాజు, సత్తరాజును హెచ్‌ఎం కాశయ్యతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.



ఏపీ లింగోటంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తన కుమారుడిని చేర్పిస్తున్న ఉపాధ్యాయుడు మణిరాజు

● పెద్దఅడిశర్లపల్లి, మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న కురిమిళ్ళ యాదయ్య తన ఇద్దరు పిల్లలు (కుమార్తె, కుమారుడు)లను ప్రభుత్వ ఎంపీపీఎస్ పీఏపల్లి పాఠశాలలో గురువారం చేర్పించారు.ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న మంచి బోధన ఎఫ్ఎల్ఎన్‌తో కుమారుడు జోసెఫ్ అభిషేక్‌ను ఒకటో తరగతిలో, కుమార్తె ప్రశస్తలేఖను 5వ తరగతిలో చేర్పించానని ఉపాధ్యాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు యాదయ్యను ఎంఈవో వెంకటయ్య ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్‌నాయక్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, సైదులు, మాధవి తదితరులు పాల్గొన్నారు.



తన పిల్లలను పెద్దఅడిశర్లపల్లి జడ్పీహెచ్ఎస్‌లో చేర్పిస్తున్న ఉపాధ్యాయుడు యాదయ్య

ఎస్సీ హాస్టల్‌లో నోట్ పుస్తకాలు పంపిణీ

కట్టంగూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):కట్టంగూరులోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలోని రెన్యూవల్ విద్యార్థులకు గురువారం ఎంఈవో అంబటి అంజయ్య నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగామాట్లాడుతూ విద్యార్థులు వసతి గృహ సౌకర్యాలను వినియోగించుకొని విద్యను అభ్యసించి ప్రభుత్వ పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుక రావాలని కోరారు. వార్డెన్ గుజ్జుల శంకర్ రెడ్డి ఉన్నారు.

కేతేపల్లి ఎస్ఐగా సతీష్ బాధ్యతలు

కేతేపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కేతేపల్లి ఎస్ఐగా యు.సతీష్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ ఎ.శివతేజ నల్లగొండ వీఆర్‌కు బదిలీకాగా వీఆర్‌లో ఉన్న సతీష్ కేతేపల్లి ఎస్ఐగా నియమితులయ్యారు. ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సతీష్‌ను మండలంలోని చీకటిగూడెం గ్రామానికి చెందిన లారీ అసోసియేషన్ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు గురువారం సన్మానించారు. కార్యక్రమంలో లఎగ్గడి సత్యనారాయణ, బుద్దె వెంకన్న, చింతం వెంకటేశ్వర్లు కోట పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

సమాచారం

23న ఇన్‌స్పైర్ అవార్డ్స్‌పై టెలీకాన్ఫరెన్స్

నల్లగొండ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను గుర్తించి బాల శాస్త్రవేత్తలుగా తయారు చేయాలని డీఈవో భిక్షపతి అన్నారు. విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ న్యూఢిల్లీ, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి హైదరాబాద్ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ మనక్-2025 ఆన్‌లైన్ నామినేషన్ల ప్రక్రియపై ఈ నెల 23వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు డీఈవో తెలిపారు.

పెట్టుబడి సాయంపై హర్షం

మునుగోడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా కింద ఇచ్చే పెట్టుబడి సాయాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయడంపై గ్లోబల్ అగ్రి ఇన్నోవేటివ్ రీసెర్చ్ పార్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు నెల్లికంటి రామవేంద్రయాదవ్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రూ. 2 లక్షలు రుణమాఫీ పథకాన్ని సత్వరమే అమలు చేసి తన చిత్తశుద్ధిని చాటుకోవాలని హితవు పలికారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

శాలిగౌరారం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరవునిబండ గ్రామానికి చెందిన సహాయ నిధి నుంచి మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో మంజూరైన రూ. లక్ష చెక్కును బాధిత కుటుంబానికి గ్రామ తాజా మాజీ సర్పంచ్ దండ రేణుకఅశోక్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు పడాల శంకర్, ఉపాధ్యక్షులు గౌస్, నాయకులు దండ శ్యామ్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై విచారణ చేయాలి

మర్రిగూడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలనిఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి పొట్ట అశోక్ కోరారు. గురువారం కుదాభక్షపల్లి గ్రామ ఏఐఎస్ఎఫ్ గ్రామ కార్యదర్శి ఇస్కిళ్ల మహేందర్ ఆధ్వర్యంలో ఎంపీడీవో మున్నయ్యకు వినతి పత్రం సమర్పించారు. కుదాభక్షపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపికలో అనర్హులకు అక్రమ కేటాయింపులు జరిగాయన్నారు. వీరి వెంట కుదాభక్షపల్లి గ్రామానికి చెందిన ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీనివాస్, మేతరి యాదయ్య, శ్రీను, గిరి తదితరులు ఉన్నారు.

మునుగోడులో జలకళ

- నిండుతున్న చెరువులు
- పారుతున్న సాగునీటి జలాలు
- రైతుల హర్షం


నీటితో కళకళలాడుతున్న పులిపలుపుల పెద్దచెరువు

మునుగోడురూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మునుగోడు ప్రాంతంలో జలకళ సంతరించుకుంది. ఎలాంటి సాగునీటి వనరులు లేని ఈ ప్రాంతానికి చెరువులు, వాగులు, కుంటలపైనే ఆధారపడి వ్యవసాయ సాగు చేసుకునే పరిస్థితి. అలాంటి ప్రాంతానికి సాగునీరు సరఫరా అవుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు నుంచి మునుగోడు ప్రాంతానికి నీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు. సాగునీటితో రెండు సీజన్‌లో పంటలు పండించి రైతులు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంబంధిత శాఖ ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. మునుగోడు మండలానికి సాగునీరు తెచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. తన సొంత ఖర్చులు సుమారు రూ. 11లక్షలు ఖర్చు చేసి బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు నుంచి చిట్యాల మండలం నేరడ వరకు ఎలికట్టు మీదుగా రత్తిపల్లి, గంగోరిగూడెం, పులిపల్పుల, కల్వలపల్లి గ్రామాల్లో చెరువులను నింపేందుకు కాల్వలు తవ్వించి కంపచెట్లను తొలగించి నీటిని తెప్పించారు. దీంతో పులిపల్పుల పెద్ద చెరువు 60 శాతం మేర నిండింది. అంతే కాకుండా చుట్టు పక్కల గ్రామాల భూగర్భ జలాలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సాగునీటి దాతకు రుణపడి ఉంటాం



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఉదయసముద్రం నుంచి నీటి తరలించడంతో మా గ్రామంలో ఉన్న చెరువు నిండుకుండలా మారింది. దీంతో వ్యవసాయ భూములలోని బోర్లు భూగర్భజలాలు పెరిగి పంటలు పండించుకుంటున్నారు. సాగునీటి దాత ఎమ్మెల్యేకు మేము రుణపడి ఉంటాం.

\- దోటి నారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్

మా కల నెరవేరింది



మా కల నెరవేరింది. చిన్ననాటి నుంచి ఈ ప్రాంతానికి సాగునీటి జలాలు పారుతాయో లేదో అనుకున్నాం. ఎమ్మెల్యే సహకారంతో రెండు సీజన్‌లు పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంది. ఎంతో మంది రైతులు సాగు చేసుకుంటూ జీవనం గడుపుతున్నాం.

\- పుట్ట శ్రీనివాస్‌రెడ్డి, రైతు, కల్వలపల్లి

పనుల్లో నిమగ్నమైన రైతులు

మర్రిగూడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రోహిణి కార్తెలో ముందస్తుగా వర్షాలు కురవడం వల్ల దుక్కులు దున్నుకొని సాగుకు సిద్ధంగా ఉన్న రైతులు వారి భూముల్లో పత్తి సాగు చేసుకున్నారు. మరి కొంతమంది ఆలస్యంగా దుక్కులు దున్నుకొని వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నెలలో వర్షాలు కురియడంతో రైతులు పత్తి విత్తన సాగు చేసుకుంటున్నారు. మండలంలో ఈ సంవత్సరం వానాకాలంలో రైతులు పత్తి సాగు కోసం 28 వేల ఎకరాల వరకు పత్తి సాగు సిద్ధం చేసుకున్నారు. అయితే కొంతమంది రైతులు రోహిణి కార్తెలోనే భారీగా బలంగా వర్షాలు పడటం వల్ల అప్పటికే దుక్కులు దున్నుకున్న సగం మంది రైతులు పత్తి సాగు చేసుకున్నారు. అడపాదడపా వర్షాలు పడడం వల్ల ముందస్తుగా పత్తి సాగు చేసుకున్న రైతుల భూముల్లో పత్తి మొక్కలు ఏపుగా ఎదిగాయి. ఏపుగా ఎదిగిన పత్తి మొక్కల మధ్య కలుపు మొక్కలను తొలగించడానికి రైతులు అరకలు కట్టి తొలగిస్తున్నారు. మరి కొంతమంది రైతులు దుక్కులు దున్నుతున్నారు. మండలంలో మూడు నాలుగు రోజుల నుంచి భారీగా వర్షాలు పడటంతో ప్రస్తుతం రైతులు దుక్కులు దున్ని పత్తి విత్తనాలు వేస్తున్నారు. ఒకపక్క రోహిణి కార్తెలోనే దుక్కులు దున్నుకొని పత్తి విత్తనాలు వేసిన రైతులు పత్తి మొక్కలు మొలవడంతో కలుపు మొక్కలను అరకలతో తొలగిస్తున్నారు. మరో పక్క ఆలస్యంగా దుక్కులు దున్నుకుని పత్తి సాగుకు సిద్ధంగా ఉన్న రైతులు వారి భూముల్లో పత్తి విత్తనాలు విత్తే పనుల్లో నిమగ్నమయ్యారు.


ఏపుగా ఎదిగిన పత్తి మొక్కల్లో అరక దున్నుతున్న రైతులు

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో రాజకీయ జోక్యం తగదు

- సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి


నల్లగొండలో నిరసన తెలుపుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి. నాయకులు

నార్కట్‌పల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. నార్కట్‌పల్లి మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన పార్టీ మండల కమిటీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా నిజమైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి పారదర్శకతను చూపాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం సగం కూడా అమలు చేయలేదని విమర్శించారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనా నేటికీ విత్తనాలు, ఎరువులు కావాల్సినంత నిల్వలను అందుబాటులో ఉంచలేదన్నారు. ఉదయసముద్రం ప్రాజెక్టు కాల్వలను వెంటనే పూర్తి చేసి రైతులకు నీరు అందించాలని, నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలోని రోడ్డు విస్తరణ పనులను పూర్తిచేయాలని, ఎల్లారెడ్డిగూడెం సోమసముద్రం చెరువు నుంచి మట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, నాయకులు దండు రవి, కట్ట రామచంద్రం, భగవంతరెడ్డి, కల్లూరి కంట్ల మహేశ్వర్, బొల్లెద్దు సైదులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాడులను ఆపాలి

నల్లగొండరూరల్ : పాలస్తీనాలో చిన్నారుల, మహిళలపై ఇజ్రాయిల్ చేస్తున్న అమానవీయ చర్యలను ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. గురువారం సీపీఎం నల్లగొండ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సుభాష్ విగ్రహం దగ్గర నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ ఇజ్రాయిల్ క్రూరమైన దాడులపై మోదీ ప్రభుత్వం మౌనం వీడాలని, బాధిత పాలస్తీనా పట్ల మానవీయతను ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నారీ ఐలయ్య, చిన్నపాక లక్ష్మీనారాయణ, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం, పుచ్చకాయల నర్సిరెడ్డి, మల్లం మహేష్ , ఖమ్మంపాటి శంకర్ ఆకారం నరేష్, మండల కార్యదర్శి నలపరాజు సైదులు, పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, దండంపల్లి సరోజ, అద్దంకి నరసింహ, కొట్ల అశోక్ రెడ్డి, ఆవుట రవీందర్, సైదాచారి, బొల్లు రవీందర్ అలీ,నోముల యాదయ్య, పాల్గొన్నారు.

దేశవ్యాప్త హర్తాల్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారి అయిలయ్య

కేతేపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవడానికి ఈ నెల 29వ తేదీన దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న హర్తాల్‌లో ఉపాధి హామీ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య కోరారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన వ్యకాస మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, రైతాంగం పండించిన పంటలకు కనీస మద్దతు ధరల చట్టాన్ని తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఢిల్లీ రైతులకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు చొగోని నాగయ్య, వి.సోడయ్య, ఎడ్ల సైదయ్య, ఎ.నాగయ్య, ఎం.దుర్గయ్య, పి.మల్లయ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ఉచితంగా అందించాలి : కేవీపీఎస్


కట్టంగూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు నాగార్జున

కట్టంగూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా విద్య, వైద్యం అందించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. కట్టంగూరు మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పుడు సంక్షేమ పథకాలు మారుతున్నాయని, పేదల బతుకుల్లో ఏ మాత్రం మార్పు రావడం లేదన్నారు. ఈ నెల 22, 23వ తేదీల్లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో కట్టంగూరులో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో నాయకులు వట్టేపాక కృష్ణ, చెనగోని రామస్వామి, పెంజర్ల సైదులు, రాజేష్, సైదులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ శిక్షణ శిబిరాలను జయప్రదం చేయాలి

నకిరేకల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కట్టంగూర్ మండల కేంద్రంలో ఈ నెల 22, 23తేదీల్లో నిర్వహించే కెవీపీఎస్ జిల్లా స్థాయి శిక్షణా శిబిరాన్ని జయప్రదం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వంటెపాక కృష్ణ కోరారు. గురువారం నకిరేకల్ పట్టణంలో శిక్షణ శిబిరం పోస్టర్లను కేవీపీఎస్ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు వి.వెంటేశ్వర్లు, కేవీపీఎస్ నాయకులు ఏర్పుల తాజేశ్వర్, పి.మల్లయ్య, భాస్కర్, పి.లింగయ్య, ఎం.వెంకన్న, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడురూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలివెల గ్రామంలో గురువారం మండల అధికారులతో కలిసి ఆయన గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లతో పాటు చేపట్టాల్సిన డ్రైనేజీ పనులు, పలివెల నుంచి చీకటిమామిడి వెళ్లే రహదారిని పరిశీలించారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్మూలించిన తర్వాత పరిస్థితులు ఏ రకంగా ఉన్నాయని మహిళలను అడిగి తెలుసుకున్నారు. మీ గ్రామంలో బెల్ట్‌షాపులు నిర్మూలించే బాధ్యత మీదేనని ఆయన సూచించారు. ఈ పర్యటనలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి, ఎంపీడీవో విజయభాస్కర్, కాంగ్రెస్ ఓబీసీసెల్ జిల్లా కార్యదర్శి బూడిల లింగయ్యాయాదవ్, పాల్వాయి జితేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెరుకుపల్లి వెంకన్న, మాజీ ఎంపీటీసీ చెరుకు కృష్ణయ్య, చెరుకు జనార్ధన్, మాజీ జడ్పీటీసీ గోస్కొండ లింగయ్య, మాజీ ఎంపీపీ మాదగోని సాయిలు, అనగంటి కృష్ణ, గ్రామ కార్యదర్శి, ఎంపీవో, విద్యుత్ ఏఈలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మునుగోడు: అనారోగ్యం బారిన పడిన పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల కోసం అందించే ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని బాధిత వర్గాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. తమ ప్రభుత్వం పేద వర్గాల వైద్యం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10లక్షలు పరిమితి పెంచిన విషయం తెలిసిందేనన్నారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నారబోయిన రవిముదిరాజ్, పాల్వాయి జితేందర్‌రెడ్డి, భీమనపల్లి సైదులు, అనంత స్వామి, అన్వర్, జంగిలి నాగరాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

స్థానిక సంస్థ ఎన్నికల్లో సత్తా చాటాలి

నాంపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో నాంపల్లి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల కార్యకర్తలు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించానలి కార్యకర్తలకు సూచించారు. మునుగోడులో క్లీన్‌స్వీప్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి, రఘుపతి రెడ్డి, పూల వెంకటయ్య, గట్టుపల్లి నర్సిరెడ్డి, పెద్దిరెడ్డి సంజీవరెడ్డి, సయ్యద్ గఫార్, వెంకటయ్య, జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి



ఇజ్రాయిల్ ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

నల్లగొండరూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులు తక్షణమే ఆపాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి దేశ ప్రధానికి కోరారు. దాడులను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ విగ్రహం వద్ద గురువారం ఇజ్రాయిల్ ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ పాలస్తీనాలో చిన్నారుల, మహిళలపై ఇజ్రాయిల్ చేస్తున్న అమానవీయ చర్యలను ఖండించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, సీపీఐ పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి, జిల్లా యాదయ్య, పానం వెంకట రాములు, పాల్గొన్నారు.

30న యాదవుల ఆత్మగౌరవ సభ

నల్లగొండ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో ఈనెల 30న నిర్వహించనున్న యాదవుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని అఖిలభారత యాదవ మహసభ ముచ్చర్ల ఏడుకొండలు పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం స్థానిక యాదవసంఘ భవన్‌లో గౌరవసభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాదవ్‌భవన్ ట్రస్ట్ చైర్మన్ చీరపంకజ్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లొడంగి గోవర్ధన్, మేకల కృష్ణ, మామిడి పద్మ, ఎల్‌వీ యాదవ్, అల్లి వేణుయాదవ్, లక్ష్మీ నారాయణ, అంబర్ల సత్యనారాయణ, జానయ్య, ముప్పిడి మల్లయ్య, వెకటేశ్వర్లు, చల్లా కోటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి దిక్సూచి రాహుల్‌గాంధీ


నకిరేకల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, నాయకులు

నకిరేకల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశానికి దిక్సూచిలాంటివాడని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ దేశానికి భావి ప్రధాని రాహుల్ గాంధీ అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రజిత, కాంగ్రెస్ మహిళా నాయకురాలు సుకన్య, పీఏసీఎస్ ఛైర్మన్ ఎన్.వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కేతేపల్లి మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

●నల్లగొండ టౌన్ : ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ యూనివర్సిటీ రాహుల్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు బూడిద కుమారస్వామి, సుమంత్, వంశీ, రాజశేఖర్, శివరామకృష్ణ, కిరణ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి: మండలంలోని నక్కలపల్లి అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు గురువారం పలకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జిల్లా పృథ్వీరాజ్, నాయకులు పల్లగొర్ల ఆకాశ్, శ్రీపతి తరుణ్, చిలుకూరి బన్నీ, శ్రీపతి చరణ్, శివరామ్, నరేందర్ పాల్గొన్నారు.

● మర్రిగూడ : మండలంలోని రాజపేట తండా ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులకు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొడాల అల్వాల్ రెడ్డి రూ.10వేల విలువైన స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేద్దాం

చండూరు రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని యోగా శిక్షకులు మాదగోని నాగార్జున అన్నారు. మండలంలోని బంగారిగడ్డ గ్రామంలో ఆయన మాట్లాడారు. దైనందిన జీవితంలో యోగాతో నిత్య ఆరోగ్యంతో పాటుగా మనసు ప్రశాంతతను చేకూరుతుందని, యోగ నిత్య జీవితంలో ఒక భాగం కావాలని ఆయన కోరారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రపంచ దేశాలకు భారతీయులు ఆదర్శప్రాయంగా ఉండాలని కోరారు.

లీలాదేవికి ఎంపీ చామల నివాళి


కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి


చిట్యాలరూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం పెద్దకాపర్తిలో గంట్ల లక్ష్మారెడ్డి సతీమణి లీలాదేవి ఇటీవల మృతిచెందింది. గురువారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలిక చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, గ్రామశాఖ అధ్యక్షుడు నీలకంఠం లింగస్వామి, మాజీ మార్కెట్‌చైర్మన్ కాటం వెంకటేశం, పీఏసీఎస్ డైరెక్టర్ ఏదుళ్ళ అజిత్‌రెడ్డి, గంట్ల లక్ష్మారెడ్డి, జడల చినమల్లయ్య, ఏర్పుల నర్సింహ, గంట్ల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెస్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీవైఎస్‌వో

నల్లగొండ స్పోర్ట్స్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ జ్ఞాపకార్థం ఈనెల 22న ఇండోర్ స్టేడియంలో నిర్వహించే ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ టోర్నమెంట్‌ను జిల్లా యువజన క్రీడల అధికారి మహ్మద్ అక్బర్‌అలీ, మాజీ డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డిలు కోరారు. గురువారం నల్లగొండ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేడియంలో టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ కార్యదర్శి కె.కరుణాకర్‌రెడ్డి, మేకల అభినవ్ తల్లిదండ్రులు మేకల వెంకటేశ్వర్లు అరుణ, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డైమండ్ శ్రీనివాస్, అర్బిటర్ మేడం విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY



నల్లగొండ
5
శుక్రవారం 20 జూన్ 2025

చికెన్ ధరలు	
లైవ్	115
డ్రెస్	170
స్కిన్‌లెస్	190
గుడ్లు డజన్	70
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	36.5
కనిష్ఠం	23.0

సందర్శనీయ స్థలాల

చార్జీల పెంపు

- ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రదేశాలకు వచ్చే సందర్శకులకు ఎఫెక్ట్
- అమలులోకి వచ్చిన పెంపు

6

అన్ని హామీలు నెరవేరుస్తాం



తుర్కపల్లి మండలం వాసాలమర్రిలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు

- ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు
- రాష్ట్రంలో ఇప్పటికే 2లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన ప్రతీ మాటను, చేసిన ప్రతీ వాగ్దానాన్ని కొంత ఆలస్యమైనా అమలు చేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో, సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని విభలాపురంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో మంత్రి మాట్లాడారు.

● ఆంధ్రజ్యోతి, తుర్కపల్లి, మోతె

7



సూర్యాపేట జిల్లా మోతె మండలం విభలాపురంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు చీర సారె అందజేస్తున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

ఇక ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్

- రిజిస్టర్‌తో పని ఉండదు
- జడ్పీ, మండల పరిషత్‌లో నూతన అటెండెన్స్ విధానం
- రోజుకు రెండుసార్లు హాజరు తప్పని సరి
- పారదర్శక సేవలందించేందుకు నిర్ణయం



రాష్ట్రంలో పారదర్శక పాలన అందించేందుకు ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంటోంది. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా అడుగులు వేస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటోంది. అందుకు ముఖకవళిక (ఫేస్ రికగ్నేషన్) హాజరు విధానాన్ని అమలుచేయనుంది.

● ఆంధ్రజ్యోతి, యాదాద్రి

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులకు విన్నవించేందుకు ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు వస్తుంటారు. అయితే అధికారులు అందుబాటులో లేకపోవడంతో వారు తీవ్ర నిరాశతో వెనుదిరుగుతుంటారు. కార్యాలయాలకు ప్రజలు వచ్చిన రోజు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండకపోవడం, అధికారులు కార్యాలయాల్లో ఉన్న రోజుల్లో ప్రజలకు ఏదో ఒక కారణంతో కార్యాలయానికి రాకపోవడం వంటివి జరుగుతున్నాయి. దీంతో సమస్యలు దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోవడంలేదు. ఈ నేపథ్యంలో ప్రజాపాలనలో ప్రజలకు అధికారులు జవాబుదారీగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మండల పరిషత్, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టింది. ఎంపీపీ, జడ్పీ కార్యాలయాల్లోని అధికారులు సమయపాలన పాటించేలా చూసేందుకు నిర్ణయించింది. అందులో భాగంగా ఇక నుంచి అధికారులు, సిబ్బంది ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ (ముఖకవళిక ఆధారిత హాజరు) ప్రవేశపెట్టనుంది. తొలుత రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో వీటిని ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకుంది. వీటి ఏర్పాటుతో విధులకు ఎగనామం పెట్టే ఉద్యోగులకు ఇకపై కష్టతరం కానుంది. అధికారులు, సిబ్బంది డుమ్మాలు కొట్టే అవకాశం లేకుండా చెక్ పడనుంది. ఉమ్మడి జిల్లాలోని యాదాద్రిభువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని మండలాల వారీగా అధికారులు, సిబ్బంది వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తున్నారు.

● రోజుకు రెండుసార్లు హాజరు


ఉమ్మడి జిల్లాలోని జిల్లాపరిషత్, మండలపరిషత్ కార్యాలయాల్లోని సిబ్బంది రోజులో రెండుసార్లు ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ తప్పనిసరిగా ఇవ్వాలి. ప్రతీ జిల్లా పరిషత్‌లో అధికారులు సిబ్బందితో కలిసి 10 నుంచి 15మంది వరకు ఉన్నారు. మండలపరిషత్‌ల్లో 10మందికి పైగానే అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త విధానం ప్రకారం ప్రతీ ఒక్కరు మిగతా 6వ పేజీలో...

● ఉమ్మడి జిల్లాలో త్వరలో..

ఉమ్మడి జిల్లాలో మూడు జిల్లా పరిషత్ కార్యాలయాలు ఉండగా, యాదాద్రి జిల్లాలో 17 మండల పరిషత్‌లు, నల్లగొండ జిల్లాలో 34, సూర్యాపేట జిల్లాలో 23 మండల పరిషత్‌లు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీవోలు, ఇతర అధికారులు, సిబ్బందికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం నివేదించింది. త్వరలోనే ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ అమలులోకి రానుంది. దీనికి సంబంధించిన యంత్రాలను ప్రభుత్వం మండల, జిల్లాపరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేయనుంది. క్షేత్రస్థాయిలో పర్యటించే అధికారుల హాజరుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

సర్టిఫికెట్లు బకాయిలు చెల్లిస్తేనే..

- తెగేసి చెబుతున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు
- ఇంటర్ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయని ప్రభుత్వం
- అయోమయంలో విద్యార్థులు



భువనగిరి టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల విడుదలలో ప్రభుత్వం చేస్తున్న జాప్యం కారణంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బకాయిలు రాకపోవడంతో ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని ప్రైవేట్ యాజమాన్యాలు తెగేసి చెబుతుండటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం విడుదల చేసే ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు తమకు చెల్లిస్తే సరిపోతుందని, ప్రైవేట్ ఇంటర్ కళాశాల యాజమాన్యాలు ఇంటర్ మొదటి సంవత్సరంలో విద్యార్థులను చేర్చుకున్నాయి. కానీ, మూడేళ్లుగా ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోతుండటంతో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణులై కళాశాలలను వీడుతున్న విద్యార్థులకు ఫీజు మొత్తం చెల్లిస్తేనే మెమో, టీసీ తదితర సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యాలు స్పష్టం చేస్తుండటంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వం ఆలస్యంగా నిధులు విడుదల చేసినా, విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లోనే జమవుతాయని, ప్రస్తుతం ఫీజు చెల్లిస్తేనే ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యాలు తెగేసి చెబుతున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ కళాశాలలతో వాగ్వాదానికి దిగుతున్నారు. ఇదే తరహా పరిస్థితి ఉమ్మడి జిల్లాలోని సుమారు అన్ని ప్రైవేట్ కళాశాలల్లో నెలకొంది. ద్వితీయ సంవత్సరంలో 26,040 మందికి 18,699 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో మిగతా 6వ పేజీలో...



కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

వైద్యులు అందుబాటులో ఉండాలి

దామరచర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్, రికార్డులను, ఔషధాల నిల్వలను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. సమయానుకూలంగా వైద్యులు, సిబ్బంది విధులకు హాజరు కావాలన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా వైద్యం కోసం వచ్చిన రోగులను వెంటనే ఆసుపత్రిలో చేర్చుకొని వైద్యం అందించాలన్నారు. కేసులు సీరియస్‌గా ఉన్నప్పుడు మాత్రమే నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి లేదా ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడ కేంద్రంలోని పిల్లలను పరిశీలించారు. నిర్మాణంలోని టాయ్‌లెట్స్ పనులను తనిఖీచేశారు. ఆక్టివిటి రూమ్‌లో నూతన సాంకేతికతను ఉపయోగించి విద్యార్థులకు కృత్యాధార పద్ధతిలో బోధించడం జరుగుతుందని, అలాగే ఫిజియోథెరపీ ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. అంతకుముందు కేజీబీవీని తనిఖీ చేసి విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. కేజీబీవీ పరిసరాలు, టాయ్‌లెట్స్ అన్నింటిని తిరిగి పరిశీలించారు. ఆమె వెంట సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్, మండల ప్రత్యేకాధికారి పత్యానాయక్, డీఈవో భిక్షపతి, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

ప్రత్యేక పిల్లలను భవితలో చేర్పించాలి

మిర్యాలగూడ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలందరినీ నమోదు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటుచేసిన భవిత కేంద్రాన్ని సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్‌తో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలకు కృత్యాధార పద్ధతుల్లో విద్యను అందించడం జరుగుతుందన్నారు. అంతేకాక వారి మానసికపరమైన లోపాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు తదుపరి విడతలో విద్యాశాఖ ద్వారా పెన్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని ఆమె తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలో భవిత కేంద్రాన్ని అందంగా తీర్చిదిద్దడంపై సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌ను, విద్యాశాఖ అధికారులను ఆమె అభినందించారు. ఆమె వెంట డీఈవో భిక్షపతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలువురు పోలీస్ అధికారుల బదిలీ

6

అక్రమంగా నల్లమట్టి రవాణా?

రైతుభరోసా దరఖాస్తుకు నేడే ఆఖరు

- కొత్త పట్టాదారుల నుంచి అర్జీల స్వీకరణ
- నేటి రాత్రికి సైట్ నిలిపివేత, ఆ తరువాత దరఖాస్తుల ఆన్‌లైన్



నల్లగొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవడానికి శుక్రవారం సాయంత్రంతో గడువు ముగుస్తోంది. రైతుభరోసా ప్రారంభం నుంచి జూన్ 5 వరకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 20 సాయంత్రంతో అర్జీల స్వీకరణకు సమయం ముగుస్తున్నందున ఎవరైనా మిగిలిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. జిల్లాలో మొత్తం 9,500మందికి కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు వచ్చాయి. వీరందరి నుంచి అర్జీలను స్వీకరిస్తున్నారు. శుక్రవారం రాత్రి 8గంటలకు ఈ దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి సైట్ నిలిపివేస్తారు. ఈ నేపథ్యంలో సంబంధిత రైతులు రైతుభరోసా కోసం శుక్రవారం సాయంత్రం 5గంటల లోగా దరఖాస్తులు చేసుకోవడానికి మండల వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది. కొత్తగా పట్టాదారు పుస్తకాలు పొందిన రైతులందరికీ ప్రస్తుతం రైతుభరోసా అందుతున్న రైతులకు వారికి కూడా జమ చేయనున్నారు. 20వ తేదీన రాత్రికి దరఖాస్తులు ఆన్‌లైన్ పూర్తయిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొత్త పట్టాదారు పుస్తకాలు పొందిన రైతులకు సంబంధించి రైతుభరోసాను ట్రెజరీకి జమ చేస్తారు. ఈ నెల 16వ తేదీ నుంచి రైతుభరోసా ప్రారంభమైన విషయం తెలిసిందే. మరో ఐదు రోజుల పాటు రైతుభరోసాను జమచేస్తారు.ప్రభుత్వం చెప్పిన విధంగా తొమ్మిది రోజుల్లో ప్రతీ అర్హుడైన రైతుకూ అందించడం కోసం కార్యాచరణ రూపొందించారు.

ఇప్పటికే రూ.516కోట్లు జమ

జిల్లా వ్యాప్తంగా గురువారం నాటికి రైతుభరోసా పథకం కింద 4.75 లక్షల మంది రైతుల ఖాతాలలో రూ.516కోట్లను జమచేశారు. రైతుభరోసా కింద రాష్ట్రంలోనే జిల్లాకు అత్యధికంగా నిధులు సమకూరాయి. జిల్లాలో మొత్తం 5,65,803మంది రైతులకు రూ. 738,67,60,000 నిధులు వచ్చాయి. రైతుభరోసా కింద రైతుల బ్యాంకుల ఖాతాల్లో జమైనందున ఆ నిధులను రైతులు ఎరువులకు, వ్యవసాయ పనిముట్లకు, వ్యవసాయ పనులకు వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. వ్యవసాయ విస్తరణ అధికారులు రైతుభరోసా కోసం కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతుల నుంచి దరఖాస్తులు ఇప్పటికే తీసుకుంటున్నారు. వచ్చిన దరఖాస్తులన్నింటికీ శుక్రవారం రాత్రి 8 గంటల లోపు ఆన్‌లైన్ డేటాను పూర్తి చేస్తారు.

జిల్లాకు అత్యధికంగా రైతుభరోసా



రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాకు రైతుభరోసా పథకం కింద నిధులు వచ్చాయి. మొత్తం 5,65,803మంది రైతులకు రూ.738కోట్ల67లక్షల60వేలను విడుదల చేశారు. ఇప్పటివరకు 4.75లక్షల మంది రైతుల ఖాతాలో రూ.516కోట్ల వరకు జమయ్యాయి. కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు శుక్రవారంలోగా రైతుభరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలి. శుక్రవారం రాత్రి వరకు అవకాశం ఉంది. రైతుభరోసా డబ్బులు సాగు అవసరాలకు రైతులు ఉపయోగించడంతో పాటు వ్యవసాయ పనులకు వినియోగించి సద్వినియోగం చేసుకోవాలి.

ఇలా త్రిపాఠి, కలెక్టర్

మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసాను ప్రతి రైతుకూ అందిస్తున్న నేపథ్యంలో వ్యవసాయ సీజన్‌కు ముందే ఎంతగానో ఉపయోగపడుతుందని రైతుల పేర్కొంటున్నారు.

ఫాంపాండ్‌ను పరిశీలించిన కేంద్ర జల సంఘం అధికారి

నార్కట్‌పల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా నార్కట్‌పల్లి మండలంలోని ఏపీలింగోటంలో కొనసాగుతున్న ఫాంపాండ్ పనులను కేంద్ర జల సంఘం అధికారి ఆనంద్‌బాబు గురువారం పరిశీలించారు. ఫారంపాండ్ యొక్క వర్క్ ఐడీ ఎన్ని పనిదినాలు ఇప్పటివరకు పూర్తయిన పనిదినాలు తదితర వివరాల నమోదును పరిశీలించి పనులు జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో, ఎంపీడీవో కత్తురోజు ఉమేశ్‌చారి, ఈసీ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి సైదిరెడ్డి, టీఏ, ఎఫ్ఏలు ఉన్నారు.



ఏపీలింగోటంలో ఫాంపాండ్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

నల్లగొండ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : బెస్ట్ అవైలబుల్ స్కీమ్ పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల జిల్లా కార్యదర్శులు ఖమ్మంపాటి శంకర్, మల్లం మల్లేష్ డిమాండ్ చేశారు. కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, టీజీఎస్ సంఘాల ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఏవో మోతీలాల్‌కు వినతిప్రతం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలో సోషల్‌వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా 19,000 దళిత విద్యార్థులు, 6,000 గిరిజన విద్యార్థులు కలిపి మొత్తం 25 వేల మంది చదువుతున్నారని తెలిపారు. ప్రతి ఏటా ఫీజులు చెల్లించకపోవడంతో రూ.154 కోట్లకు బకాయి పెరిగిందన్నారు. దీంతో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద చదువుకుంటున్న విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని, బిల్లులు రాకపోవడంతో యాజమాన్యాలు ఈ స్కీంపై విద్యార్థులను చేర్చుకునేందుకు ఆసక్తి చూపించడంలేదన్నారు. ప్రభుత్వం వెంటనే బిల్లులను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల నరేష్, ఆయా సంఘాల నాయకులు బొల్లు రవీందర్ పాల్గొన్నారు.



ఏవో మోతీలాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న వివిధ సంఘాల నాయకులు

ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోవాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో రమణారెడ్డి


దేవరకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్ పరిధిలోని చెరువులు, కుంటలు ఆక్రమణకు గురికాకుండా తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఆర్డీవో రమణారెడ్డి కోరారు. గురువారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని అన్నిమండలాల తహసీల్దార్లు, నీటిపారుదలశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైనందున చెరువులు, కుంటలు నీటితో నిండి కోతకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ముందస్తుగా చర్యలు చేపట్టాలన్నారు. చెరువులు, కుంటల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు అధికారులు చెరువులు, కుంటలను పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం, పంచాయతీల నిర్వహణను నిత్యం పర్యవేక్షించాలన్నారు.

విద్యార్థులు నిత్యం యోగా సాధన చేయాలి

మాడ్గులపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క విద్యార్థి నిత్యం యోగా సాధన చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఆయూష్ డిపార్ట్‌మెంట్ హోమియో డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణ, డాక్టర్ యూనుస్ అన్నారు. మండలకేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. యోగా చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు వేదమిత్ర, నామిరెడ్డి సుష్మ, ప్రిన్సిపాల్ సునీత పాల్గొన్నారు.

సాగర్ బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నాగార్జునసాగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఉన్న బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ మాధవీలత గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె సాగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఇంటర్‌లో సాధించిన మార్కులను బట్టి ఆయా కోర్సుల్లో సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.



నింపాదిగా..నిదానంగా...

- కొనసాగుతున్న ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ
- దరఖాస్తుదారులు స్పందించాలంటున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్)

అక్రమ లేఅవుట్లు, అనధికారిక వెంచర్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు 2020లో నాటి ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. దీంతో మిర్యాలగూడ పట్టణ పరిధిలో 14336 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే నాటి నుంచి నేటి వరకూ క్రమబద్ధీకరణ ప్రక్రియ ఎన్నో అవాంతరాలను అధిగమిస్తూ వస్తోంది.

ఫీజులో 25 శాతం రాయితీ

అక్రమ వెంచర్లు, అనధికారిక ప్లాట్లలో స్థలాలు కొన్న దరఖాస్తుదారులు వాటిని క్రమబద్ధీకరించుకునేందుకు ససేమిరా అంటున్నారు. ప్రభుత్వం పలు రకాలుగా ప్రచారం చేసినా, క్రమబద్ధీకరణ ప్రక్రియను నిలిపేస్తామని ప్రకటించినా.. దరఖాస్తుదారుల నుంచి అంతగా స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్న ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సర ముగింపులో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపులో వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) విధానాన్ని ప్రకటించి 25 శాతం రాయితీ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 31వ తేదీ నాటికి ఫీజు చెల్లించిన వారికే రాయితీ వర్తిస్తుందని పేర్కొంది.

స్పందన అంతంతమాత్రంగానే

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియలో ప్రభుత్వం ఫీజు రాయితీ ప్రకటించినా దరఖాస్తుదారుల నుంచి అంతగా స్పందన రాలేదు. దీంతో ఏప్రిల్ నెలాఖరు వరకూ తొలుత రాయితీ కొనసాగించిన ప్రభుత్వం దరఖాస్తులు అంతగా రాకపోవడంతో మే మాసాంతానికి పొడగించింది. అయినా దరఖాస్తుదారులు నామమాత్రంగానే వస్తుండగా ప్రభుత్వం ఈ నెల 30వ తేదీ వరకు ఫీజు 25శాతం రాయితీ పథకాన్ని పొడిగించింది.



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుని పత్రాలు పరిశీలిస్తున్న మునిసిపల్ అధికారులు

పట్టణ పరిధిలో ఇలా..

మొత్తం 14336 దరఖాస్తులు రాగా అందులో 2815 దరఖాస్తుదారులు ఫీజు చెల్లించారు. 1608 మందికి ప్రొసీడింగ్స్ అందజేశారు. మరో 1207 దరఖాస్తుల పరిశీలన జరుగుతుండగా, 33 దరఖాస్తులను రిజెక్ట్ చేశారు అధికారులు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీరణలో జూన్ తొలివారానికి రూ.12.5 కోట్ల ఆదాయం సమకూరినట్లు పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు తెలిపారు.

శరవేగంగా క్రమబద్ధీకరణ



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ శరవేగంగా జరుగుతోంది. దరఖాస్తుల పరిశీలనకు రెవెన్యూ, నీటి పారుదల శాఖల సహకారం తీసుకుంటున్నాం. ఫీజు చెల్లించిన దరఖాస్తులను మూడు దశల్లో పరిశీలన చేసి క్రమబద్ధీకరిస్తున్నాం. ప్రభుత్వం ప్రకటించిన 25శాతం ఫీజు రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. దరఖాస్తుదారులు పట్టణ ప్రణాళిక విభాగంలో సంప్రదించి తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి.

\- మహ్మద్ యూసుఫ్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ

ప్లాట్ల విలువ పెరుగుతుంది



అక్రమ వెంచర్లలో కొన్న స్థలాలను ఖచ్చితంగా క్రమబద్ధీకరించుకోవాలి. లేనిచో క్రయ, విక్రయాలు సాగించడం కుదరదు, నిర్మాణ అనుమతులు మంజూరు కావు. రెగ్యులర్ అయిన ప్లాట్ల విలువ పెరుగుతుంది. రెగ్యులరైజేషన్ పూర్తయిన ప్లాట్లపై బ్యాంకు రుణాలు పొందవచ్చు. సదరు స్థలాలను ష్యూరిటీ కింద పెట్టుకోవచ్చు. దరఖాస్తుదారులు స్పందించి ముందుకు రావాలి.

\- కట్టెబోయిన అంజయ్య, టీపీఎస్

ఆర్థికసాయం అందజేత

పెద్దవూర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిచెర్ల గ్రామానికి చెందిన షేక్ సయ్యద్‌పాషా ఇటీవల మృతి చెందాడు. అతనితో పదో తరగతి చదివిన చిన్ననాటి స్నేహితులు గురువారం పాషా నివాసానికి చేరుకొని కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం కుటుంబసభ్యులకు రూ.51వేల ఆర్థికసాయం అందించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇరుమాది పాపిరెడ్డి, గోవిందిరెడ్డి, జనపాటి శివ, జిల్లెల యాదయ్య, బొడ్డుపల్లి సైదులు, అయితబోయిన సైదులు, కామిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ మృతి బాధాకరం

దేవరకొండ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మాజీ సర్పంచ్ హనుమంతు చంద్రన్న సతీమణి, మైనంపల్లి మాజీ ఎంపీటీసీ హనుమంతు పెద్దమ్మ మృతి బాధాకరమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం దేవరకొండలో పెద్దమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట హనుమంతు వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, చింతపల్లి సుభాష్, బీఆర్‌ఎస్ నేతలు ఉన్నారు.

ఇళ్ల స్థలాల పత్రాలు అందజేత

చింతపల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేటితడ్డతండాలో ఇందిరమ్మ ఇళ్ల స్థలాల పత్రాలను మంజూరైన లబ్ధిదారులకు మాజీ సర్పంచ్ ఇస్లావత్ పద్మపుల్‌సింగ్‌నాయక్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు తగిన మౌలిక వసతి సౌకర్యాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.

బీసీ గురుకులో సీఈసీ గ్రూపు మార్చవద్దు



కృష్ణయ్యను కలిసి సమస్యలు వివరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేత శ్రీనివాస్‌గౌడ్

దేవరకొండ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దేవరకొండ బీసీ గురుకుల కళాశాలలో ఉన్న సీఈసీ గ్రూపును నార్కట్‌పల్లికి మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని, దీంతో ఈ ప్రాంత విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి గురువారం రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యకు విన్నవించారు. వెంటనే స్పందించిన రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య గురుకులాల కార్యదర్శి సైదులుతో మాట్లాడినట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. దేవరకొండ బీసీ గురుకుల కళాశాలలో సీఈసీ గ్రూపు యథావిధిగా కొనసాగుతుందని ఆర్.కృష్ణయ్య హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్.కృష్ణయ్యను కలిసిన వారిలో బీసీ సంఘం నాయకులు చంద్రశేఖర్, లింగయ్యగౌడ్, హనుమంతు, యాదయ్య, శ్రీనివాస్, లచ్చిరాం పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ

పెద్దవూర, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, నోట్‌బుక్స్ వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పాఠశాలల్లో విద్యార్థులు సరిపడా బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించి నూతనంగా నిర్మించాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శోభన్‌బాబు, తరుణ్, నగేష్, గోపాల్, నాగేందర్, లక్ష్మి, స్వరూప పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తిరుమలగిరి(సాగర్), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేలావత్ నగేష్‌నాయక్ అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు కోసం ఎకరానికి రూ.6వేల చొప్పున రైతుల ఖాతాల్లో నగదును జమ చేయడంపై మండలంలోని సుంకిశాలతండాలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆయన క్షీరాభిషేకం చేశారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కెలావత్ తావునాయక్, నాయకులు రమావత్ జబ్బార్‌నాయక్, రమావత్ హన్నానాయక్, పంతునాయక్, సూర్యనాయక్, దశరథ, సీతారాం, బిచ్యానాయక్, సోనాలి, ద్వాలి, బుజ్జి, చందు తదితరులు పాల్గొన్నారు.

22న సాగర్‌లో మెగా వైద్యశిబిరం

నాగార్జునసాగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్ కాలనీలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఈ నెల 22వ తేదీ ఆదివారం నల్లగొండ పట్టణానికి చెందిన ఐకాన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఈ శిబిరంలో ఆరోగ్యశ్రీ, ట్రాన్స్‌కో, జెన్‌కో, ఈహెచ్‌ఎస్ కార్డుదారులు వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. శిబిరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందని వారు పేర్కొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రొగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్(పీఎస్‌యూ) జిల్లా కన్వీనర్ వంశీ డిమాండ్ చేశారు. గురువారం డీఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు యథేచ్ఛగా పుస్తకాలు విక్రయిస్తున్నాయని, అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. విద్యను వ్యాపారంగా మారుస్తున్న వారిపై తగినచర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవి, శంకర్, అరుణ్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పుస్తక పఠనం దివ్యౌషధం

మిర్యాలగూడ టౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం దివ్యౌషధమని నేతాజీ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్, విద్యావేత్త శ్రీపతి శ్రీనివాస్ అన్నారు. జాతీయ పఠన దినోత్సవం సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ పుస్తకం ఒక పాఠం నేర్పుతుందన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి పట్టణ అధ్యక్షుడు చేగొండి మురళీయాదవ్, నాయకులు దాసరాజు జయరాజు, బీమ్లానాయక్, దేవకి, కల్యాణి, అలివేలు, సునీత, సైదమ్మ, జమీన్ తదితరులు పాల్గొన్నారు.

యువత చేతిలో దేశ భవిష్యత్తు

- ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టిన రోజు వేడుకలు

మిర్యాలగూడ అర్బన్, దేవరకొండ, చింతపల్లి, నిడమనూరు, వేములపల్లి, హాలియా, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్తమాన రాజకీయాలపై యువత దృష్టి సారించాలన్నారు. అనంతరం స్థానిక బకల్‌వాడీ, మైనార్టీ గురుకుల పాఠశాల, గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసి కేక్ కట్‌చేశారు. ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం జన్‌నాయక్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటేష్, గాయం ఉపేందర్‌రెడ్డి, రఫీ, సైదులు, శేఖర్‌రెడ్డి, బీఎల్‌ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

● దేవరకొండ మండలం మైనంపల్లిలో రాహుల్‌గాంధీ పుట్టినరోజు సందర్భంగా మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమి, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రాంసింగ్ నాయక్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాగ్యలక్ష్మీ, మాజీ ఉపసర్పంచ్ వెంకట్, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జన్‌నాయక్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శకంర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

● చింతపల్లి మండలంలోని మండలంలోని వెంకటేశ్వరనగర్ (మాల్)లో కాంగ్రెస్ యువజన నాయకులు పీహెచ్‌సీలోని మహిళలకు గురువారం బ్రెడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రామిని నగేష్, నాయకులు ఎండీ.ఖలీల్‌బేగ్, బాదేపల్లి శ్రీకాంత్‌గౌడ్, పాలకూర్ల రాజుగౌడ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● నిడమనూరు మండలంలోని ముప్పారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ప్రధాని పదవి చేపట్టి దేశానికి సేవలు అందించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, కొండా శ్రీనివాస్‌రెడ్డి, ముంగి శివమారయ్య, ఆలంపల్లి మైసయ్య, చర్క శ్రీను, మేరెడ్డి వెంకటరమణ, ప్రసాద్, పాపయ్య, మల్లప్ప, నర్సింహ, గంగాధర్, యాదగిరి పాల్గొన్నారు.

● వేములపల్లి మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు పుట్టల పెదవెంకన్న ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో రోగులకు, గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చకని సత్యం, బొంగర్ల వినోద్, దైద గిరి, మా తంగి చంటి, పుట్టల శ్రీనివాస్, బొంగర్ల సమాధానం, పగడాల వెంకన్న, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● హాలియాలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మల్‌రెడ్డి భానుచందర్‌రెడ్డి ఆధ్వర్యంలో హాలియాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ హరినాయక్, నాయకులు సైదులు, అమరేందర్‌రెడ్డి, శ్రీకాంత్, మధు, సందీప్‌రెడ్డి, చందు, రాజు, సూరి, బాలకృష్ణ, కొత్త నాగరాజు, వేణుగౌడ్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

పల్లాకు పరామర్శ



పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్‌కుమార్

హాలియా, జూన్19(ఆంధ్రజ్యోతి): శస్త్ర చికిత్స అనంతరం యశోద ఆస్పత్రిలో కోలుకుంటున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, నోముల భగత్‌కుమార్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట కరీంనగర్ గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి : బీజేపీ

డిండి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కేతావత్ లాలునాయక్ అన్నారు. డిండి మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థికరంగంలో దేశాన్ని నాలుగవ స్థానంలో నిలిపిన ఘనత ప్రధాని మోదీసేనని అన్నారు. దేశ రక్షణ విషయంలో ఇతర దేశాల జోక్యం లేకుండా మన దేశాన్ని కాపాడుకుంటున్నామని పేర్కొన్నారు. 370 ఆర్టికల్ రద్దు, ట్రిపుల్ తలాక్, వక్ఫ్ బోర్డు సవరణ, చట్ట సభల్లో మహిళలకు 33 శాతం, నిరుపేదలకు ఉచిత సన్నబియ్యం బీజేపీ ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు సింకారు సైదా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ ఏటి కృష్ణ, నాయకులు ఎలకుర్తి జైపాల్, ఎలకుర్తి రమేష్, రాధిక కృష్ణ, వానం మౌనిక, అంజియాదవ్, భాస్కర్, బిక్షపతి, రామకృష్ణ, ఆంజనేయులు, రమేష్ పాల్గొన్నారు.



బీజేపీ మండల సంకల్ప సభలో మాట్లాడుతున్న లాలునాయక్

సీపీఐ మండల మహాసభను జయప్రదం చేయాలి

దామరచర్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే సీపీఐ మండల మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి ధీరావత్ లింగానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో ప్రజలు అందజేసిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాంతో అధిక లాభాలు

పెద్దవూర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పాం సాగు చేయడం వల్ల రైతులు అధిక ఆదాయం ఆర్జించవచ్చని నాగార్జునసాగర్ డివిజన్ ఉద్యానవన అధికారి కె.మురళి తెలిపారు. పెద్దవూర మండలంలోని తుంగతుర్తి గ్రామంలో కత్తి జయసింహారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ఆయిల్‌పాం మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పతంజలి కంపెనీ జిల్లా మేనేజర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగు మెళకువలను రైతులకు తెలిపారు. కార్యక్రమంలో బి. సంపత్‌కుమార్, ఆయిల్‌ఫాం క్షేత్ర సిబ్బంది వెంకన్న, శ్రీను, జయసింహారెడ్డి కుటుంబసభ్యులు, రైతులు పాల్గొన్నారు.



మొక్కలను నాటుతున్న డివిజన్ ఉద్యానవన అధికారి కె.మురళి

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

వేములపల్లి, చింతపల్లి, తిరుమలగిరి(సాగర్), జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని వేములపల్లి, చింతపల్లి, తిరుమలగిరి(సాగర్) మండలాల ఎంఈవో లక్ష్మణ్ నాయక్, ఎన్.అంజయ్య, శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయా మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో మెరుగైన విద్య అందించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించి నష్టపోకుండా తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వాటి బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ బడుల్లో ఉత్తమ ఉపాధ్యాయులతో బోధించనున్నట్లు తెలిపారు. వేములపల్లిలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దీన సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపల్లిలో జగతి ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు, పుస్తకాలు, తదితర సామగ్రిని అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దూపాటి రమేష్, అధ్యాపకులు ప్రేమలత, జయశ్రీ, సంధ్య, వరలక్ష్మి, చంటి, మల్లేష్, నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) మండలంలోని శ్రీరాంపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు పునర్ వైభవం తీసుకురావడంలో గ్రామస్థులు సహకరించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా గార్లపాటి వెంకటేశ్వర్లు సహకారంతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బోధన సామగ్రిని ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ నాగమణి, హెచ్‌ఎం ఫరీద్, ఉపాధ్యాయురాలు మల్లీశ్వరి, స్థానికులు వెంకటేశ్వర్లు, ఏలియా, చంద్రయ్య, శివారెడ్డి, ప్రశాంత్, రమేష్ పాల్గొన్నారు.



తిరుమలగిరి (సాగర్): విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బోధన సామగ్రిని అందజేస్తున్న ఎంఈవో శ్రీనివాస్, దాత వెంకటేశ్వర్లు

వినతుల వెల్లువ

మిర్యాలగూడటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సమభావన సంఘం సభ్యులు పొదుపు చేసిన నిధులను బ్యాంకులో చెల్లించకుండా దుర్వినియోగం చేసిన లీడర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సంఘ సభ్యులు మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని 21వ వార్డు బాపూజీనగర్‌కు చెందిన శ్రీసాయిరాం మహిళా సంఘం పేరున పొందిన రుణానికి చెందిన నిధులు స్వీకరించిన సంఘ పెద్ద సదరు నిధులను సొంత ఖర్చులకు వాడుకున్నదని వినతిపత్రంలో పేర్కొన్నారు. రుణం అందించిన బ్యాంకు వారు తమని రీ పేమెంట్ కోసం ఇబ్బంది పెడుతున్నారని, అవసరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కమిషనర్‌ను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మర్రి రత్నమాల, ఖమ్మంపాటి లక్ష్మీ, పందిరిపద్మ, ఉప్పల్ల మోహన దుర్గ, శ్రీలక్ష్మి తదితరులున్నారు.

● నిడమనూరు: భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారుల బృందం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు మండలంలో కొనసాగుతున్నాయి. ఈ నెల 20వ తేదీ వరకు సదస్సులను నిర్వహించనున్నారు. ఏళ్ల తరబడి పరిష్కారం కాకుండా ఉన్న తమ భూముల సమస్యలను సత్వరమే పరిష్కారం చేయాలని రైతులు అధికారులకు వినతులు సమర్పిస్తున్నారు.

భూమి విస్తీర్ణంలో తేడాలు, పట్టాదారు పాసు పుస్తకాల్లో మార్పులు, అసైన్డ్ భూముల పట్టాలు, పౌతి, సాదాబైనామాల కోసం ఎక్కువ మంది రైతులు సదస్సుల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇస్తున్నారు. సదస్సుల్లో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఆర్ఐలు దాడి రాజిరెడ్డి, సందీప్, అనిల్, ఈశ్వర్, మస్తాన్, శశి, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొంటున్నారు.

బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దు

మిర్యాలగూడ అర్బన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): హనుమాన్‌పేట రెసిడెన్షియల్ ఏరియాలోని రామాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బార్ అండ్ రెస్టారెంట్‌కు అనుమతులు ఇవ్వవద్దని స్థానికులు కోరారు. ఈ మేరకు గురువారం అదనపు కలెక్టర్, మునిసిపల్ కార్యాలయంలో హనుమాన్‌పేట వాసులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ రామాలయానికి కేవలం 50 మీటర్ల దూరంలోనే కొత్తగా బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు మద్యం వ్యాపారులు ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు. స్థానికుల ఇబ్బందులను. నిబంధనలను పరిగణించి పర్మిషన్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్, మునిసిపల్ కమిషనర్‌కు స్థానికులు సత్యనారాయణ, వీరయ్య, సాంబశివ, సత్యం, ఆరీఫ్, మట్టయ్య, రెహనా, పద్మ, నాసయ్య, వెంకటయ్య తదితరులు ఫిర్యాదు చేశారు.



సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

సినిమా గైడ్: మిర్యాలగూడ: శ్రీనివాస : సితారే జమీన్ పర్ / వెంకటేశ్వర: 8 వసంతాలు / రాఘవ: కుబేర / విట్రోస్: కుబేర, 8 వసంతాలు, దేవరకొండ : మనోజ్ : తొలిప్రేమ/ మైత్రి వెంకటేశ్వర : ---